హైదరాబాద్
శనివారం
19-1-2019
సంపుటి: 3, సంచిక: 20
పేజీలు: 8+8, వెల: రూ.5
/manamnews
www.manamnews.com

మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA



2025 తర్వాతే రామమందిరం

2024 లోక్‌సభ ఎన్నికల అనంతరం తెరపైకి

ఇప్పటికి మందిరం అంశం అటకెక్కినట్లే

ఆర్‌ఎస్‌ఎస్ డిప్యూటీ చీఫ్ భయ్యాజీ జోషి

5

అయ్యప్పను దర్శించుకున్న 51 మంది మహిళలు

సుప్రీంకోర్టుకు వివరించిన కేరళ సర్కారు

ఎన్నికల గంట!

మార్చి మొదటివారంలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు?

- ఎన్నికల కమిషన్ ప్రకటించే అవకాశం
- లోక్‌సభ.. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి కూడా
- ఒడిశా, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్‌లకూ!
- గతంలోనూ మొదటివారంలోనే షెడ్యూలు
- 4 నుంచి 9 దశల్లో లోక్‌సభకు ఎన్నికలు
- జూన్ 3తో ముగుస్తున్న లోక్‌సభ గడువు
- ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి.. జూన్ 18 వరకు
- భద్రతాదళాల అందుబాటు ప్రధాన సమస్య
- ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, సిబ్బంది కూడా
- అన్నీ లెక్క చూసుకుని షెడ్యూలు ప్రకటన



న్యూఢిల్లీ, జనవరి 18:

ఎన్నికల గంట మోగనుంది! మామూలుగా అయితే మార్చి చివరివారం లేదా ఏప్రిల్ మొదటి వారంలో ఎన్నికల తేదీలను ఎన్నికల కమిషన్ ప్రకటిస్తుందని ఇన్నాళ్లూ భావించినా, ఇప్పుడు మాత్రం ఏకంగా మార్చి మొదటి వారంలోనే ఈ తేదీల ప్రకటనకు కమిషన్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. లోక్‌సభతో పాటు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి కూడా ఒకేసారి ఎన్నికలు జరగనున్నాయి. ఒడిశా, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల అసెంబ్లీలకు కూడా అదే సమయంలో ఎన్నికలుంటాయి. ప్రస్తుత లోక్‌సభ కాలం ..మిగతా 2లో



అతిథి దేవోభవ

ఆతిథ్యం మా సంప్రదాయం.. గాంధేయ వాదం మా నైజం..

యువత నాయకత్వం వహించాలి.. రాజకీయాల్లోకి రావాలి..

అంతర్జాతీయ సదస్సు ప్రారంభోపన్యాసంలో ఎంపీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్‌లో ప్రారంభమైన యువజన నాయకత్వ సదస్సు

135 దేశాల నుంచి విచ్చేసిన ప్రతినిధులు, ప్రత్యేక ఆహ్వానితులు

ప్రధానాంశంగా 'గాంధేయ మార్గంలో సుస్థిర అభివృద్ధి, ఆవిష్కరణలు'



హైదరాబాద్ : 'అతిథిని దేవుడిగా సత్కరించడం మా సంప్రదాయం.. గాంధేయ మార్గంలో నడవడం మా నైజం..' అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత తెలిపారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ సదస్సు మొదటి రోజు ప్రారంభోపన్యాసం చేసిన కవిత 'భారత దేశం యువజన దేశంగా పేరు పొందింది. మానవ వనరులు పుష్కలంగా ఉన్నాయి.

వీరికి అన్ని విధాలా చేదోడువాదోడుగా ఉంటూ ముందుకు నడిపించాల్సిన అవసర ముందన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలనీ, ఇతర రంగాల్లోనూ లీడ్ చేయాలని ఆమె ఈ సందర్భంగా కోరారు. 135 దేశాల నుంచి 550 మంది ప్రతినిధులతో పాటు 16 దేశాల నుండి 70 మంది వక్తలు, 40మంది ప్రత్యేక ఆహ్వానితులు ఈ సదస్సుకు హాజరయ్యారు. పలు రంగాల్లోని ముఖ్య నేతలు, యువజన సంఘాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువకులు మిగతా 2లో..

ముహూర్తం

శ్రీ చాంద్రమాన విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం; తిథి: శుక్లపక్షం త్రయోదశి ప.3.43 వరకు; తదుపరి: చతుర్దశి; నక్షత్రం: మృగశిర ఉ.8.51 వరకు; తదుపరి: ఆరుద్ర; వర్జ్యం: సా.4.51 నుంచి 6.21 వరకు; దుర్ముహూర్తం: 6.38 నుంచి 8.06 వరకు; రాహుకాలం: ఉ.9.00 నుంచి 10.30 వరకు; యమగండం: ప.1.30 నుంచి 3.00 వరకు; అమృతఘడియలు: రా.10.10 నుంచి 11.40 వరకు; శనిత్రయోదశి;

వాతావరణం



శనివారం తెలంగాణలో వాతావరణం వేడిగా, అక్కడక్కడ మేఘావృతమై ఉంటుంది. రాత్రి చలిగాలుల తీవ్రత కొంత పెరుగుతుంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 28 డిగ్రీలు
కనిష్ఠ ఉష్ణోగ్రత: 16 డిగ్రీలు
గాలి వేగం: గంటకు 16కి.మీ.

కారెక్కిన ఒంటేరు

కేటీఆర్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరిక



హైదరాబాద్, జనవరి 18 (మనం ప్రతినిధి):గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఒంటేరు ప్రతాప్ రెడ్డి టీఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ భవన్‌లో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో ప్రతాప్ రెడ్డి, ఆయన కార్యకర్తలు గులాబీ దళంలో చేరారు. పార్టీ కండువా కప్పిన కేటీఆర్ ప్రతాప్ రెడ్డిని పార్టీలోకి మిగతా 2లో..



రాజకీయ అపర చాణక్యుడు కేసీఆర్

ఒంటేరు మెడలో గులాబీ కండువా

బద్ధశత్రువును మిత్రునిగా మార్చుకున్న వైనం

టీఆర్ఎస్ రాజనీతిజ్ఞం ముందు ఎవరైనా బలాదూరే!

గజ్వేల్‌లో మరింత బలపడనున్న గులాబీ పార్టీ

హైదరాబాద్, జనవరి 18 (మనం ప్రతినిధి):

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రాజకీయంగాబద్ధశత్రువు ఒంటేరు ప్రతాపరెడ్డి శుక్రవారం సాయంత్రం టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. మెదక్ జిల్లా రాజకీయాల్లో ఇది ఎవరూ ఊహించని పరిణామంగా పేర్కొంటున్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి. హరీశ్‌రావు ప్రమేయం లేకుండానే ఒంటేరు ప్రతాపరెడ్డి టీఆర్ఎస్‌లో చేరిపోయారు. పార్టీ వర్కింగ్ మిగతా 2లో..

ఇదీలోకం!



స్వైన్‌ఫ్లూ కచ్చితంగా ప్రతిపక్షాలు, తెలుగుదేశం, కాంగ్రెస్, టీఆర్ఎస్ వాళ్ల కుట్ర వల్లే వచ్చింది!

నేల విడిచి సాము!

గాడి తప్పుతున్న ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణ

- ఎన్నికల ముందు ప్రజాకర్షక పథకాలు
- మోదీ పథకాలకు లక్ష కోట్ల పైనే ఖర్చు
- కొత్త సర్కారుపై రెవెన్యూ నష్టాల భారం
- చిన్నరైతులు.. ఉద్యోగులే బీజేపీ టార్గెట్
- రైతుబంధు తరహాలోనే.. కేంద్ర పథకం?
- వడ్డీలేని రుణాలు.. ఖాతాల్లోకి డబ్బులు
- ఇప్పటికే భారీగా పెరుగుకున్న ద్రవ్యలోటు
- 2017-18లో జీడీపీలో 3.5 శాతం!
- అదుపుచేసే చర్యలు బడ్జెట్‌లో శూన్యం
- రాష్ట్ర ప్రభుత్వాలన్నింటిదీ.. అదే తీరు



న్యూఢిల్లీ, జనవరి 18:

హిందీ బెల్టులోని అత్యంత కీలకమైన మూడు రాష్ట్రాలలో ఓటమి చవిచూడటం.. మరికొన్ని నెలల్లో సార్వత్రిక ఎన్నికలు కళ్ల ముందు ఉండటంతో ప్రధాని నరేంద్రమోదీ నేల విడిచి సాము చేస్తున్నారు! ఎన్నికలకు ముందు ఓట్ల ఆకర్షణ ..మిగతా 2లో

మరో చరిత్ర



వివరాలు స్పోర్ట్స్‌లో..

మెన్ ఇన్ బ్లూ మరో చరిత్ర సృష్టించారు. టెస్టు సిరీస్ గెలిచిన కోహ్లీ సేన తొలిసారి ఆస్ట్రేలియా గడ్డపై వన్డే సిరీస్‌ను కైవసం చేసుకుంది. వరల్డ్ కప్‌కు తొలి ప్రాక్టీస్‌గా భావించిన ఆస్ట్రేలియా పర్యటనలో టీమిండియా ఆద్యంతం అద్భుత ప్రతిభ కనబరిచింది. కెప్టెన్ విరాట్ కోహ్లీ మొదలుకొని చాహల్ వరకు అందరూ తమ తమ స్థాయిలో సత్తా చాటారు. ముఖ్యంగా మొన్నటి వరకు తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న మాజీ కెప్టెన్, వికెట్ కీపర్ మహేంద్ర సింగ్ ధోనీ చివరి రెండు మ్యాచ్‌ల్లో ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు.

రాజకీయ అపర చాణక్యుడు కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)



ప్రెసిడెంట్‌గా కేటీఆర్ రాజకీయ వ్యూహానికి ఇదో తార్కాణంగా చెప్పుకుంటున్నారు. రాజకీయ అపర చాణక్యుడిగా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పేరుంది. రాజకీయాల్లో శత్రువులను మిత్రులుగా మార్చుకోవడంలో ఆయన దిట్ట అనేది జగమెరిగిన సత్యం. రాజకీయాల్లో కేసీఆర్ పేరు వింటేనే మండిపడే రాజకీయ నాయకుల్లో కొందరు గత కొంత కాలంగా విపక్షంలో ఉంటూనే కేసీఆర్ జపం చేస్తున్నారు. కాంగ్రెస్ టికెట్‌పై గెలిచిన ఎమ్మెల్యేలు కూడా కేసీఆర్ చాణక్య వ్యూహం ముందు మేమెంత అని భావిస్తున్నారు. అంతకు మించిన పరిణామంగా ఒంటేరు చేరికను అభివర్ణిస్తున్నారు.

ఇటీవలి ఎన్నికల వరకు కేసీఆర్‌పై కయ్యానికి కాలు దువ్విన ఒంటేరు ప్రతాపరెడ్డి కేటీఆర్ రాజకీయ వలలో పడ్డారు. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయనే ఆభియోగంలో ఒంటేరు ప్రతాపరెడ్డి కొద్ది రోజుల క్రితమే హై కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఇంతటి రాజకీయ వైరం ఉన్న ఒంటేరు ప్రతాప రెడ్డి టీఆర్‌ఎస్‌లో చేరడం వెనుక అనేక రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయనే గుసగుసలు వినబడుతున్నాయి. రాజకీయాల్లో మిత్రులు శత్రువులుగా మారడం, శత్రువులు మిత్రులుగా మారడం సర్వసాధారణం అనే నానుడిని ఒంటేరు ప్రతాపరెడ్డి నిజం చేశారనే వాదన వినబడుతుంది. టీఆర్‌ఎస్‌లో ట్రబుల్ షూటర్‌గా పేరున్న హరీష్‌రావు ప్రమేయం లేకుండానే కేసీఆర్ వ్యూహాన్ని కేటీఆర్ ఆచరణలో పెట్టడంలో విజయవంతమైనారనే ప్రచారం పార్టీ వర్గాల్లో జరుగుతుంది. గజ్వేల్ నియోజక వర్గం నుంచి 2014, 2018 ఎన్నికల్లో కేసీఆర్‌తో ఒంటేరు ప్రతాపరెడ్డి తలపడ్డారు. ఒంటేరు ప్రతాపరెడ్డి 2014లో టీడీపీ నుంచి, 2018లో కాంగ్రెస్ నుంచి కేసీఆర్‌పై పోటీ చేసి ఓడిపోయారు. డిసెంబర్ ఎన్నికల్లో కేసీఆర్‌కు గట్టి పోటీనే ఇచ్చారు. తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. బలమైన నాయకుడని రుజువు చేసుకున్నాడు. ఆ అర్హతలే ఒంటేరును టీఆర్‌ఎస్‌లో చేర్చు కొనేందుకు కేసీఆర్ ప్రమాణికంగా తీసుకున్నారు. శాసనసభ ఎన్నికల్లో టీఆర్ఎస్ ఘన విజయం సాధించడంతో ముఖ్యమంత్రి కేసీఆర్ దేశ రాజకీయాలపై దృష్టి కేంద్రీకరించారు.

పార్టీ బాధ్యతల నుండి కొంత వరకు తప్పుకునేందుకు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్‌ను నియమించారు. దేశ రాజకీయాల్లో కాంగ్రెస్, బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఫెడరల్ ఫ్రెంట్ ఏర్పాటు చేయడంపై ప్రాంతీయ పార్టీలతో సమాలోచనలు జరుపుతున్నారు. రాబోవు పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసే ఆలోచనలో కూడా ఉన్నారు. దేశ రాజకీయాల్లో చక్రం తిప్పాలంటే పార్లమెంటుకు ఎన్నిక కావడం అత్యంత ప్రధానం అని భావిస్తున్నారు. కేసీఆర్ పార్లమెంటుకు పోటీ చేసిన పక్షంలో గజ్వేల్ స్థానం ఖాళీ అవుతుంది. దానికి ఉప ఎన్నిక అనివార్యం. గజ్వేల్ నుండి కేసీఆర్ తప్ప మరెవరు పోటీ చేసినా ఒంటేరు ప్రతాపరెడ్డి గెలుపు ఖాయం అనే అభిప్రాయంతో సీఎం కేసీఆర్ ఉన్నారు. దీంతో ముఖ్యమంత్రి గెలిచిన స్థానంలో టీఆర్‌ఎస్ ఓడిపోతే రాజకీయంగా తీవ్రమైన ఇబ్బందులు ఉంటాయని భావించిన కేసీఆర్ ఏకంగా ఒంటేరు ప్రతాపరెడ్డినే పార్టీలోకి లాగేందుకు ప్రణాళిక రూపొందించి అమలు బాధ్యతను వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అప్పగించారు. ఆయన ఆపరేషన్ ఆకర్ష్ కార్యక్రమానికి పదునుపెట్టి ట్రబుల్ షూటర్ హరీశ్‌రావు ప్రమేయం లేకుండానే ఒంటేరు ఒంటిపై గులాబీ కండువా కప్పి టీఆర్‌ఎస్‌లో చేర్చుకున్నారు. ఒంటేరు ప్రతాపరెడ్డి తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో పున్నారని టీఆర్‌ఎస్ నాయకత్వం గుర్తించింది. ఒంటేరుకు ఆర్థిక తోడ్పాటు అందించడంతో పాటుగా కోరుకుంటే ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టడానికి, లేదంటే గజ్వేల్ నుండి టీఆర్‌ఎస్ అభ్యర్థిగా గెలిపించుకోవడానికి హామీ ఇచ్చి ఒప్పించినట్టుగా తెలుస్తోంది. ఒంటేరు ప్రతాపరెడ్డి కూమారుడికి కూడా రాజకీయ భవిష్యత్ కల్పిస్తామనే హమి ఇవ్వడంతో ఆయన మనసు మార్చుకొని కాంగ్రెస్‌ను వీడాలనే నిర్ణయానికి వచ్చారంటున్నారు. శాసనసభకు ఎన్నిక కావాలనేది ఒంటేరు ప్రతాపరెడ్డి చిరకాల వాంఛ. అందుకే ఆయన మొదట టీడీపీ పక్షాన పోటీ చేశారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరి బలమైన నాయకునిగా ఎదిగారు.

గత పదేళ్లుగా ఆయన గజ్వేల్ నియోజక వర్గ రాజకీయాల్లో కొనసాగుతున్నారు. కేసీఆర్‌కు గట్టి పోటీ ఇవ్వడంలో ఆయనకు మించిన నాయకుడు లేడని రుజువు చేశారు. దీంతో ఏకంగా ఒంటేరుకే గులాబీ కండువాను కప్పడంతో గజ్వేల్ నియోజక వర్గంలో టీఆర్‌ఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు కేసీఆర్ వ్యూహాత్మకంగా పావులు కదిపారు అని టీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.



కారెక్కిన ఒంటేరు

(మొదటి పేజీ తరువాయి)

ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డితో పాటు ఉమ్మడి మెదక్ జిల్లా టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు ప్రతి ఒక్కరికి అందుతున్నాయి. అందువల్లే రెండు సార్లు ఓడిపోయానని తెలిపారు. సీఎం ప్రాతినిధ్యం వహించడం గజ్వేల్ ప్రజలు చేసుకున్న అదృష్టం. నాలుగేండ్లలో గజ్వేల్ రూపురేఖలు మారిపోయాయి. ప్రజలు అడగకుండానే సీఎం కేసీఆర్ ఎన్నో పనుల చేశారు. పార్టీ ఆదేశాల మేరకు పనిచేస్తామని పేర్కొన్నారు.



అతిథి దేవోభవ

(మొదటి పేజీ తరువాయి)

భారత్ లోని పలు రాష్ట్రాల నుంచి వివిధ రంగాలకు చెందిన కీలక యువ నేతలంతా ఈ సదస్సుకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంపి కవిత మాట్లాడుతూ... సంస్క ృతీ, సంప్రదాయాల విషయంలో ప్రపంచంలోనే భారత్ కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. విదేశాల నుంచి ఎవరొచ్చినా ఇక్కడ ప్రజలు గౌరవిస్తారని...ఇక, ప్రాచీన సంస్క ృ తికి పుట్టినిల్లైన తెలంగాణ, అతిథి మర్యాద పట్ల ఇతరులకు ఇచ్చే గౌరవం ప్రపంచంలో మరెక్కడా లభించదని కవిత పేర్కొన్నారు. అతిథి దేవోభవ గౌరవిస్తారని భారత్‌కు వచ్చిన అతిథులకు మర్యాద ఇచ్చిపుచ్చుకోవడంలో తెలంగాణ వారిది విశిష్ట సంప్రదాయమన్నారు. దీని పట్ల తాను గర్వకారణంగా ఫీల్ అవుతున్నట్లు చెప్పారు. భారత్ లోని

కవిత ప్రసంగానికి ప్రశంసలు..

ఈ అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సులో యువతను ఉద్దేశించి ఎంపీ కవిత మాట్లాడిన తీరుపట్ల ముఖ్య నేతలతో పాటు వివిధ దేశాల నుంచి వచ్చిన వక్తలు, ప్రతినిధులు ప్రశంసించారు. ఆకర్షితులయ్యారు.

ఇదేవిధంగా సభాప్రారంభ సమయానికి రాలేకపోయిన అన్నా హజారే, బస చేసిన హోటల్‌కు వెళ్లిన కవిత ఘనంగా సత్కరించారు. తాను సమయానికి రాలేకపోయినా కూడా ఆన్‌లైన్‌లో చూశానని, కవిత చేసిన ప్రసంగం ఆకర్షించింది అని ఆయన కవితను మెచ్చుకున్నారు.

అతిథులుగా అతిరథులు..

మొదటి రోజు సమావేశానికి సామాజిక వేత్త పద్మభూషణ్ అన్నా హజారే హాజరై ప్రసంగించారు. కాగా, నేడు సార్క్ మాజీ సెక్రటరీ జనరల్ అర్జున్ బహదూర్ తాపా ప్రత్యేక అతిథిగా హాజరవుతారు.

ముగిసిన రెండో విడత నామినేషన్ల ఘట్టం

3342 గ్రామాల్లో 10,668 మంది సర్పంచ్ అభ్యర్థులు

4135 పంచాయతీల్లో 788 ఏకగ్రీవాలు

పంచాయతీ ఎన్నికల్లో కొనసాగుతున్న ఐక్యతారాగం

హైదరాబాద్, జనవరి 18 (మనం ప్రతినిధి):

రెండో విడత పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఇవాళ్టితో ముగిసింది. రెండో విడతలో 4135 గ్రామాల్లో ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ అయింది. అందులో 788 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. రెండో విడతలో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కానీ గ్రామాలు 5 కాగా.. మొత్తం ఎన్నికలు జరగనున్న గ్రామపంచాయతీలు 3342. అన్ని గ్రామాల్లో 10,668 మంది సర్పంచ్ అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. రెండో విడతలో 26,191 వార్డు సభ్యుల పదవికి ఎన్నికలు జరగనున్నాయి. వార్డు సభ్యుల పదవికి 63,480 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు.

ఐపీఎస్ అధికారుల బదిలీలు

- పలువురికి పదోన్నతులు

అమరావతి, జనవరి 18: రాష్ట్రంలో పలువురు ఐపీఎస్ అధికారుల బదిలీ,పదోన్నతులు జరిగాయి. ఈ మేరకు శుక్రవారం ఆదేశాలు జారీ అయ్యాయి. శాంతిభద్రతల అడిషనల్ డీజీ గా రవిశంకర్, రవాణ శాఖ కమిషనర్ బాల సుబ్రహ్మణ్యంకు అడిషనల్ డీజీగా, కృపానంద్ త్రిపాఠి ఉజాల కు హోంగార్డ్స్ అడిషనల్ డీజీగా పదోన్నతి లభించింది. లాజిస్టిక్స్ అడిషనల్ డీజీ గా హరీష్ కుమార్ గుప్తా, గ్రేహౌండ్స్ ఐజీ గా వినీత్ బ్రిజ్ లాల్, ఏలూరు రేంజ్ డీఐజీ గా త్రివిక్రమ్ వర్మ, విశాఖ రేంజ్ డీఐజీ గా పాలరాజ్, టెక్నికల్ సర్వీసెస్ డీఐజీగా శ్రీకాంత్ బదిలీ అయ్యారు.

ఎన్నికల గంట!

(మొదటి పేజీ తరువాయి)


జూన్ మూడో తేదీతో ముగుస్తుంది. అయితే, ఈశాన్య భారతంలోని రాష్ట్రాలకు కూడా ఎన్నికలు నిర్వహిం చాల్సి ఉండటంతో ఎన్ని దశల్లో నిర్వహించాలి, ఏయే తేదీలలో నిర్వహించాలన్న లెక్కలన్నీ కట్టుకుని వాటి కోసం ముందుగానే ప్రకటిం చాలని ఈసీ వర్గాలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. భద్రతా దళాల అందుబాటు, ఈవీఎంల తరలింపునకు సమయం, ఎన్నికల సిబ్బంది అందుబాటు.. వీటన్నింటినీ కూడా కమిషన్ పరిగణనలోకి తీసుకుం టుంది. దాంతో.. ఈ భారీ ప్రక్రియ అంతటికీ మార్చి మొదటివా రంలోనే శ్రీకారం చుట్టాలని ఎన్నికల కమిషన్ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీ లకు కూడా అదే సమయంలో ఎన్నికలుంటాయి. ఇప్పటికే జమ్ము కశ్మీర్ అసెంబ్లీని రద్దు చేసినందున.. అక్కడ కూడా ఆరు నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అందువల్ల ఆ రాష్ట్రానికి కూడా సార్వత్రిక ఎన్నికలతో పాటే కలిపి ఎన్నికలు నిర్వహించే అవకాశం లేకపోలేదు. 2018 నవంబరులో కశ్మీర్ అసెంబ్లీని రద్దు చేశారు. దాంతో మేలోగా అక్కడ ఎన్నికలు పూర్తికావాలి. అందువల్ల లోక్‌సభ ఎన్నికలతో పాటే అక్కడ కూడా నిర్వహించే అవకాశం ఉన్నా.. ఆ రాష్ట్రంలో ఉన్న సున్నితమైన భద్రతా పరిస్థితుల దృష్ట్యా మరికొంత ముందుగానే ఆ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించే అవకాశం సైతం లేకపో లేదు. సాధారణ పరిస్థితుల్లో అయితే జమ్ము కశ్మీర్ అసెంబ్లీ పదవీకా లం ఆరు సంవత్సరాలు ఉంటుంది. అది 2021 మార్చి 16తో పూర్తి కావాల్సి ఉంది. దేశంలోని ఇతర రాష్ట్రాల అసెంబ్లీలు, లోక్‌సభ పదవీ కాలం మాత్రం ఐదు సంవత్సరాలే. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ పదవీకాలం జూన్ 18తో పూర్తవుతుండగా.. సిక్కిం అసెంబ్లీ మే 27, ఒడిశా అసెంబ్లీ జూన్ 11, అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీ జూన్1తో ముగుస్తాయి. అందు వల్ల వీటన్నింటికీ కలిపి ఒకేసారి.. లేదా కొన్ని విడతలలో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంటుంది.

2004 సంవత్సరంలో లోక్‌సభకు నాలుగు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఫిబ్రవరి 29వ తేదీన ఎన్నికల కమిషన్ ప్రకటించింది. అప్పట్లో మొదటి దశ పోలింగ్ ఏప్రిల్ 20న ప్రారంభం కాగా, చిట్ట చివరిది మే 10వ తేదీన నిర్వహించారు. 2009లో మార్చి 2వ తేదీన ఐదు దశల లోక్‌సభ ఎన్నికల తేదీలను ఈసీ ప్రకటించింది. అప్పుడు ఏప్రిల్ 16వ తేదీన మొదలై.. మే 13వ తేదీన ఎన్నికలు ముగిశాయి. 2014 సంవత్సరంలో ఎనినకల కమిషన్ తొమ్మిది దశల ఎన్నికల ప్రక్రియకు మార్చి 5వ తేదీన షెడ్యూలు ప్రకటించింది. తొలి దశ ఎన్నికలు ఏప్రిల్ 7వ తేదీన జరగ్గా, చిట్టచివరిది మే 12వ తేదీన జరిగింది.

పడవ ప్రమాదాల నివారణచర్యలకు సీఎస్ ఆదేశం

అమరావతి, జనవరి 18, మనం ప్రతినిధి: కృష్ణా, గోదావరి నదులు దాటేందుకు సురక్షితమైన పడవలు సమకూర్చుకోవాలని ప్రభుత్వ ప్రధాన అధికారి అనిల్‌చంద్ర పునేఠా అధికారులను ఆదేశించారు. పడవ ప్రమాదాలను నివారించేందుకు అవసరమైన ఏర్పాట్లపై సీఎస్, పలు శాఖల ఉన్నత అధికారులతో శుక్రవారం సచివాలయంలో సమీక్ష జరిపారు. గడచిన మూడు సంవత్సరాల్లో జరిగిన పడవ ప్రమాదాల్లో దాదాపు 67 మందికి పైగా చనిపోయారని అధికారులు సీఎస్‌కు వివరించారు. ఇకపై పడవ ప్రమాదాలు జరగకుండా ఉండేలా అధునాతన పడవలు కొనుగోలు చేసుకోవాలని సీఎస్ అధికారులకు సూచించారు. పడవలకు లైసెన్సులు ఇవ్వడం, శిక్షణ కలిగిన డ్రైవర్లను నియమించడం ద్వారా ప్రమాదాలు తగ్గించవచ్చన్నారు. ప్రయాణికులను చేరవేసే పడవలకు అనుమతులు తప్పనిసరి చేసి, గడువులోగా లైసెన్సులు ఇవ్వాలన్నారు. జలవనరులు, పోలీస్, ఫైర్, పంచాయతీ రాజ్, పర్యాటక శాఖ ఉన్నత అధికారులు రెండు నెలలకోసారి సమావేశాలు నిర్వహించుకుని పడవ ప్రమాదాల నివారణపై చర్చించుకోవాలన్నారు.

ఈ వారమే కీలకం!



ఒంగోలు, జనవరి 18 (మనం న్యూస్‌బ్యూరో): రాష్ట్రంలో ఈ వచ్చే వారం రోజులు కీలకం కానున్నాయా? ఎన్ని కల ప్రధానాధికారి ఆర్పీ సిసోదియా బదిలీ ఒక వైపు.. జగన్‌పై హత్యా యత్నం కేసులో చోటుచేసుకుంటున్న పరిణామాలు మరోవైపు.. రాష్ట్రంలో మరోసారి టీడీపీ కీలక నేతలు, వారి కంపెనీలపై ఐటీ / ఈడీ / సీబీఐ దాడులు జరుగుతాయన్న ఊహాగా నాలు.. ఇవన్నీ కలిసి చివరకు సీఎం చంద్రబాబు దావోస్ పర్యటన, వైసీపీ అధినేత జగన్ లండన్ పర్యటన రద్దు చేసుకున్నారా? ఇప్పుడు ఎక్కడ చూసినా ఇదే చర్చ సాగుతోంది. వచ్చే వారం రోజుల్లో ఏపీ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటాయని అధికార టీడీపీ, విపక్ష వైసీపీ అనుమానిస్తున్నాయి. ఇవి రాబోయే ఎన్నికలను మరో మలుపు తిప్పే అవకాశాలున్నట్లు ఇరు పార్టీల అధినేతలు చంద్రబాబు, జగన్ భావిస్తున్నట్లు తెలిసింది. అందుకే ఇరువురు నేతలు తమకు అత్యంత కీలకమైన విదేశీ పర్యటనలను సైతం వాయిదా వేసుకున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి జగన్ శుక్రవారం హైదరాబాద్ నుంచి లండన్ బయలుదేరి వెళ్లాల్సి ఉంది. ప్రతిష్ఠాత్మకమైన లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో చదువుతున్న తమ కుమార్తె వర్షను కలిసేందుకు జగన్ కుటుంబ సమేతంగా లండన్ వెళ్లాల్సి ఉన్నా.... చివరి నిమిషంలో ఆ పర్యటనను రద్దు చేసుకోవడం ఆసక్తి రేపుతోంది. ప్రస్తుతం హత్యాయత్నం కేసులో ఎన్ఐఏ అధికారులు జగన్‌ను వాంగ్మూలం ఇవ్వాలని కోరడంతో తాను త్వరలోనే ఎన్ఐఏ ముందు హాజరవుతానని ఆయన వారికి సమాచారం కూడా ఇచ్చారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ అధికారులు తమకు సహకరించడం లేదని ఎన్ఐఏ వర్గాలు విజయవాడ కోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. అసలు ఈ కేసులో ఎన్ఐఏ దర్యాప్తుపై రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఇవన్నీ జగన్ పర్యటనపై ప్రభావం చూపినట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ నెల 22న ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సుకు హాజరయ్యేందుకు సీఎం చంద్రబాబు బృందం దావోస్ వెళ్లాల్సి ఉంది. ఈ పర్యటనపై కేంద్రం ఆంక్షలు విధించడం, కొందరినే అనుమతిస్తాననడం, ఆ తర్వాత చంద్రబాబు విజ్ఞప్తితో కేంద్రం అనుమతించడం తెలిసిందే. ఈ పర్యటనకు అంతగా పట్టుబట్టిన చంద్రబాబు.. ఇప్పుడు ఉన్నట్టుండి దాన్ని రద్దుచేసుకుని, తన బదులు లోకేశ్ బృందాన్ని పంపడం చర్చనీయాంశమవుతోంది. శనివారం కోల్‌కతాలో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీతో ప్లాన్ చేసిన ఫెడరల్ ఫ్రంట్ ర్యాలీకి చంద్రబాబు హాజరు కావాల్సి ఉంది. ఈ పర్యటనకు కూడా చంద్రబాబు వెళ్లడం అనుమానంగానే ఉంది. జగన్‌పై హత్యాయత్నం కేసులో సిట్ అధికారులు తమకు సహకరించడం లేదంటూ ఎన్ఐఏ అధికారులు విజయవాడ కోర్టులో పిటిషన్ వేసిన నేపథ్యంలో కోర్టు నుంచి ఆదేశాలు వస్తాయని చంద్రబాబు భావిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో అసలు ఎన్ఐఏ దర్యాప్తునే సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు చంద్రబాబు.. న్యాయవర్గాలతో సుదీర్ఘంగా చర్చిస్తున్నారు. ఈ కేసులో హైకోర్టులో ప్రతికూల తీర్పు వస్తే ఎన్ఐఏ మరింత దూకుడు ప్రదర్శిస్తుందని ప్రభుత్వం అంచనా. దీంతోపాటు ఈ నెలాఖరులోపు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మరోసారి ఐటీ, ఈడీ, సీబీఐ తదితర వర్గాలతో టీడీపీ నేతలు, వారి సంస్థలపై దాడులు చేయిస్తుందని కూడా టీడీపీ అనుమానిస్తోంది.

నేల విడిచి సాము!


(మొదటి పేజీ తరువాయి)

కోసం ఆయన ప్రవేశపెడుతున్న పథకాలకు దాదాపు లక్ష కోట్లకు పైగానే ఖర్చవుతుందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ఈ అదనపు ఖర్చులు లేదా రెవెన్యూ నష్టాలను ఎన్నికల తర్వాత ఏర్పడే కొత్త ప్రభుత్వమే భరించాల్సి ఉంటుంది. ఇప్పుడిలా భారీ ఖర్చు చేయడం వల్ల ప్రభుత్వ బడ్జెట్‌లోటును తగ్గించే ప్రయత్నాలు కూడా ఆలస్యం అవుతాయి.

గ్రామీణ భారతంలో పంట నష్టాలు, వ్యవసాయ ఉత్పత్తులకు తగిన ధరలు రాకపోవడం, వాటికి తోడు పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ ప్రభావం లాంటివన్నీ కలిపి.. ఇటీవల మూడు రాష్ట్రాలలో బీజేపీ అధికారాన్ని కోల్పోయేలా చేశాయి. సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి విజయం సాధించడం ఖాయమన్న ధీమాతోనే మోదీ నిన్న మొన్నటి వరకు ఉన్నారు. కానీ రాజస్థాన్‌కు తోడు ఆయన ఎంతగానో ఆశలు పెట్టుకున్న మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలోనూ ఓటమి తప్పకపోవడంతో కాస్త జంకినట్లు కనిపిస్తోంది. దాంతో ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న మధ్యంతర బడ్జెట్‌లో ప్రభుత్వం చాలావరకు రైతులను దృష్టిలో పెట్టుకుని పలు పథకాలు ప్రకటించే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. రైతుల ఖాతాల్లోకి నేరుగా నగదు బదిలీ, వారికి వడ్డీలేని రుణాల లాంటివి ప్రకటించవచ్చని తెలుస్తోంది. దానికితోడు మధ్యతరగతి ఉద్యోగులను ఆకట్టుకోడానికి పన్ను రాయితీ వరాలు సైతం కురిపించవచ్చు. ఇప్పటికే అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు, చిన్న వ్యాపారులకు జీఎస్టీలో ఊరట లాంటి కొన్ని ప్రకటించిన విషయం తెలిసిందే.

ఎన్నికల కమిషన్ మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో ఎన్నికల తేదీలను ప్రకటించే అవకాశం ఉంది. ప్రభుత్వం ఏం చేసినా దానికి ముందే చేసుకోవాలి. కమిషన్ ఒకసారి తేదీలు చెప్పిందంటే ఆ క్షణం నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుంది. దాంతో ఆ తర్వాత ఏం ప్రకటించినా అది ఓటర్లను ప్రభావితం చేస్తుందని అలాంటి ప్రకటనలపై నిషేధం విధించారు.

2017-18 ఆర్థిక సంవత్సరంలో భారత ద్రవ్యలోటు రూ. 5.9 లక్షల కోట్లుగా ఉంది. ఇది జీడీపీలో 3.5 శాతం. అయితే, ప్రస్తుతం ద్రవ్యోల్బణం తక్కువగానే ఉంది కాబట్టి.. తాము ప్రధానంగా విస్తరణ ఆర్థిక విధనాలపై దృష్టిపెడతామని బీజేపీ ఆర్థిక వ్యవహారాల అధికారిక ప్రతినిధి గోపాలకృష్ణ అగర్వాల్ తెలిపారు. దీనివల్ల వృద్ధి పెరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆర్థికలోటును జీడీపీలో 3.3 శాతం లోపు ఉంచాలన్న ఆర్థిక మంత్రిత్వశాఖ ఆలోచనలను బీజేపీ సర్కారు ఇప్పటికి పట్టించుకునే అవకాశాల్లేవు. రైతుల సమస్యలను తీర్చడం చాలా ముఖ్యమని అగర్వాల్ అన్నారు. ఆర్థిక వ్యవస్థలో వృద్ధిని సాధించడంపై దృష్టి పెట్టాలి తప్ప, ద్రవ్యలోటు లాంటి అంశాలపై కాదని వ్యాఖ్యానించారు. మూడు రాష్ట్రాల ఎన్నికల్లో ఓటమి తర్వాత మోదీ సర్కారు చాలామంది చిన్న వ్యాపారులు జీఎస్టీ చెల్లించాల్సిన అవసరం లేకుండా ఊరట కల్పించారు. అప్పటివరకు రూ. 20 లక్షలుగా ఉన్న టర్నోవర్ పరిమితిని ఒకేసారి రూ. 40 లక్షలకు పెంచారు. దాంతోపాటు ఆదాయపన్ను చెల్లించాల్సిన ఉద్యోగుల ఆదాయ స్థాయిని కూడా గణనీయంగా పెంచే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దానికితోడు.. అగ్రవర్ణ పేదలకు 10% కోటా అందించేందుకు వీలుగా యూనివర్సిటీలు, కాలేజీలలో కొత్తగా సీట్ల సంఖ్య పెంచేందుకు కూడా కోట్లాది రూపాయలు వెచ్చించే అవకాశం కనిపిస్తోంది. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో ఓటమి ఎదురవుతుందన్న భయంతోనే కేంద్ర ప్రభుత్వం ఈ సంక్షోభ పరిస్థితిని సృష్టిస్తోందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరవ్‌వల్లభ్ వ్యాఖ్యానించారు. వడ్డీలేని రుణాలు, ఖాతాల్లోకి నగదు అన్నీ ఇలాంటివేనన్నారు. ఇదంతా చూస్తుంటే మోదీ సర్కారు ఎంతలా భయపడుతోందో అర్థం అవుతుందన్నారు. 2016లో పెద్దనోట్లు రద్దు చేయడం, 2017లో జీఎస్టీ అమలుతో ఒక్కసారిగా దేశంలో గత 20 ఏళ్లలో ఎన్నడూ లేనంత తీవ్రమైన వ్యవసాయ సంక్షోభం నెలకొందని వల్లభ్ అన్నారు. రైతులకు వడ్డీలేని



రుణాలు ఇవ్వడం వల్ల బ్యాంకులకు ప్రభుత్వం దాదాపుగా ఏడాదికి రూ. 12 వేల కోట్లు చెల్లించాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఇది మాత్రమే కాదని, ప్రభుత్వం ప్రవేశపెట్టే ఇతర పథకాలకు మరో రూ. 40 వేల కోట్లు అవసరం అవుతాయని ఆర్థికశాఖ వర్గాలు అంటున్నాయి. ఇదంతా ఇలా ఉంటే, వ్యక్తిగత ఆదాయపన్ను, వాణిజ్య పన్నులలో రాయితీలు ఇవ్వడం వల్ల రూ. 25 వేల కోట్ల ఆదాయం నష్టపోతుందని.. అలాగే పలు రకాల వస్తువులపై జీఎస్టీ శ్లాబును 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడం వల్ల మరో రూ. 13 వేల కోట్ల ఆదాయం పోతుందని అంటున్నారు. భూమి ఉన్న రైతులకు హెక్టారుకు రూ. 2000-4000 వరకు ఇవ్వాలనుకోవడం చాలా ఖరీదైన వ్యవహారమని, కానీ దానివల్ల ఫలితం ఉంటుందని విశ్లేషిస్తున్నారు. ఈ ఒక్క పథకం ప్రవేశపెడితే వడ్డీలేని రుణాల లాంటివి ఉండకపోవచ్చంటున్నారు. రిజర్వు బ్యాంకు ప్రభుత్వానికి ఈ మార్చి నాటికి రూ. 40 వేల కోట్ల డివిడెండ్ చెల్లించే అవకాశం ఉంది. కానీ అది ఈ అవసరాలకు ఏమాత్రం సరిపోదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటును కనీసం జీడీపీలో 3.4 శాతానికి తీసుకురావాలని మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ ఇప్పటికే మనకు ఒక లక్ష్యం విధించింది. ఎన్నికల సమయంలో చాలా రాష్ట్రాలు కూడా ఆర్థిక క్రమశిక్షణను గాలికి వదిలేస్తున్నాయని ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రాలన్నింటి, కేంద్ర ద్రవ్యలోటును పరిగణనలోకి తీసుకుంటే అది ఏకంగా జీడీపీలో 6.6 శాతంగా ఉంది. రుణమాఫీలు, ఇతర సబ్సిడీల కారణంగా రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక పరిస్థితి దిగజారుతోందని మూడీస్ ఉపాధ్యక్షుడు విలియం ఫోస్టర్ అన్నారు. మూడు రాష్ట్రాలలో ప్రభుత్వాలు ఏర్పాటుచేసిన కాంగ్రెస్ పార్టీ... రుణమాఫీని ప్రకటించింది. దానికితోడు కర్ణాటకలో ఒకేసారి రూ. 46వేల కోట్ల పంటరుణాలు మాఫీ చేస్తామని అక్కడి సీఎం కుమారస్వామి అన్నారు. ఇవన్నీ కూడా ఆర్థిక వ్యవస్థ మీద ప్రతికూల ప్రభావాలు కనబరుస్తున్నాయి. 2021 నాటికి ద్రవ్యలోటును జీడీపీలో 3 శాతానికి తగ్గించగలిగితేనే ఆర్థిక క్రమశిక్షణ పాటించినట్లవుతుంది. గత నాలుగైదేళ్లుగా బాగానే ఉన్నా.. ఇప్పుడు ఎన్నికల సంవత్సరం కావడంతో మరోసారి ఇది దారితప్పుతోంది.



ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసిన పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మారెడ్డి శ్రీనివాసరెడ్డి



బెంగళూరులోని ప్యాలెస్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న సేంద్రియ, తృణధాన్యాల అంతర్జాతీయ ట్రేడ్ ఫెయిర్‌లో ఏర్పాటైన తెలంగాణ స్టాల్



హైదరాబాద్‌లోని బేగంపేట పబ్లిక్ స్కూల్‌లో 25 నుంచి 27వ తేదీ వరకు జరుగనున్న హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, తదితరులు

సీఎల్పీ నేతగా భట్టి

- ప్రకటించిన కాంగ్రెస్ అధిష్టానం



హైదరాబాద్: కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకుడిగా మల్లు భట్టి విక్రమార్కనియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ అధిష్టానం ఒక ప్రకటనలో తెలియజేసింది. గత మూడ్రోజులుగా సీఎల్పీ నేతగా ఎవర్ని ప్రకటించాలనే విషయమై అధిష్టానం, తెలంగాణ కాంగ్రెస్ నేతలు నిశితంగా చర్చించి ఫైనల్‌గా భట్టి పేరును ఖరారు చేయడం జరిగింది. శుక్రవారం సాయంత్రం విక్రమార్కనే సీఎల్పీ నేత అని కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రకటించారు. భట్టి నియామక ప్రకటన రాగానే మధిర నియోజకవర్గంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆయన అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు, అనచరులు బాణసంచా పేల్చి.. స్వీట్లు పంచుకున్నారు.

కాగా.. సీఎల్పీ రేసులో మొదట్నుంచీ భట్టితో పాటు ఉత్తమ్, డి.శ్రీధర్‌బాబు, సుధీర్ రెడ్డి కూడా ఉన్నట్లు వార్తలు వచ్చిన సంగతి విదితమే తెలంగాణ కాంగ్రెస్ తరపున మొత్తం 19 మంది ఎమ్మెల్యేలుగా గెలిచారు. మధిర నియోకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన భట్టీ.. టీఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజ్‌పై గెలుపొందారు.

అంబేద్కర్ విద్యానిధికి 42 మంది ఎంపిక

- విదేశాల్లో ఉన్నత చదువులకు ఆర్థిక సాయమందిస్తారు



హైదరాబాద్, జనవరి 18: విదేశాల్లో ఉన్నత చదువులు చదివేందుకు అంబేద్కర్ విదేశీ విద్యానిధి కింద 42 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఎస్సి సంక్షేమ శాఖ సంచాలకులు పి.కరుణాకర్ తెలిపారు. శుక్రవారం మాసబ్‌ట్యాంక్‌లోని సంక్షేమ భవన్‌లో వీరికి సర్టిఫికెట్ల పరిశీలన, ఇంటర్వ్యూలు నిర్వహించామని తెలిపారు. ఈ పథకానికి 48 మంది దరఖాస్తు చేసుకోగా, 45 మంది హాజరయ్యారని అన్నారు. వీరిలో 42 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

ఈ ఇంటర్వ్యూలో ఎంపికైన 42 మంది విద్యార్థులను అమెరికా, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, ఫ్రాన్స్, జపాన్, న్యూజిలాండ్, దక్షిణ కొరియా దేశాలలో ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, అగ్రికల్చర్ సైన్సెస్, మెడిసిన్, నర్సింగ్, సోషల్ సైన్సెస్, హ్యూమనిటీస్ లలో పోస్టు గ్రాడ్యుయేషన్ ఆ పై కోర్సులు చదవడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించనుందని తెలిపారు. విమాన ప్రయాణానికి, వీసా ఖర్చులు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, ఎస్సి సంక్షేమ శాఖ ఉప సంచాకులు బి.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంతానానికి స్కాలర్‌షిప్పులు

- కార్మికులకు ఉపకార వేతనాలు కూడా..
- తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి నిర్ణయం

తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి ఆధ్వర్యంలో దుకాణాలు, వాణిజ్య సంస్థలు, కర్మాగారాలు, మోటారు రవాణా సంస్థలు, సహకార సంస్థలు ధార్మిక, ఇతర ట్రస్టులల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలకు, కార్మికులకు ఉపకార వేతనాలు అందించాలని నిర్ణయించినట్లు మండలి ఇన్‌ఛార్జి సంక్షేమ కమిషనర్ పీ శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..మండలి ఆధ్వర్యంలో చేస్తున్న సంక్షేమ పథకాలలో భాగంగా 2017,18 విద్యా సంవత్సరంలో ఉతీర్ణులైన వారికి ప్రతిభ ఆధారంగా ఈ వేతనాలు అందిస్తామని తెలిపారు.

ఇందుకోసం ఫిబ్రవరి 15 లోగా దరఖాస్తులను కార్మిక శాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు. 10వ తరగతి, ఐటీఐలో ఉత్తీర్ణులైన వారికి రూ.1000, పాలిటెక్నిక్ రూ.1500, ఇంజనీ రింగ్, మెడిసిన్, లా,బీస్సీ(అగ్రికల్చర్),మెడికల్ లెబోరేటరీ టెక్నిషియన్, పీజీ డిప్లమా, ఇన్ మెడికల్ లేబోరేటరీ టెక్నీషియన్ పూర్తి చేసిన వారికి రూ.2000 అందిస్తామని తెలిపారు.

సాగు నీరందించడమే ప్రాధాన్యత

- ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేయాలె
- సాగునీటి ప్రాజెక్టులపై సీఎం ఆదేశం
- పనులు సాగుతున్న తీరుపై అధికారులతో సమీక్ష



హైదరాబాద్, జనవరి18 (మనం ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్రంలో 1.25 కోట్ల ఎకరాలకు సాగునీరు అందించడం కోసం రూ.2.25 లక్షల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన నీటి పారుదల ప్రాజెక్టుల పనులు వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అధికారులను ఆదేశించారు. తెలంగాణ రైతులకు సాగునీరు అందించడానికన్నా మించిన ప్రాధాన్యత మరొకటి లేదని, ప్రాజెక్టుల నిర్మాణానికి నిధుల కొరత లేదని, వెంట వెంటనే బిల్లులు చెల్లించనున్నట్లు వెల్లడించారు. తమ్మిడిహట్టి వద్ద బ్యారేజి నిర్మించడంతో పాటు, పెద్దవాగు నీటిని సద్వినియోగం చేసుకోవడానికి సమగ్ర వ్యూహం రూపొందించుకుని నిర్మాణాలు ప్రారంభించాలన్నారు.

నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణంపై ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం ప్రగతి భవన్ లో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, సిఎస్ ఎస్.కె.జోషి, సిఎంఓ కార్యదర్శి స్మితా సభర్వాల్, నీటి పారుదల శాఖ ఇఎన్సి మురళీధర్, ఓఎస్డీ శ్రీధర్ దేశ్ పాండే, సిఇలు హరిరామ్, శంకర్, శ్రీనివాస్ రెడ్డి, ఎస్.ఇ.లు విష్ణు ప్రసాద్, వేణు, ఇఇ రామక ష్ణ, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

''తెలంగాణ నిర్మిస్తున్న ప్రాజెక్టుల కోసం ఇప్పటి వరకు రూ.77,777 కోట్ల ఖర్చు జరిగింది. భూ సేకరణ, ప్రత్యామ్నాయ అడవుల పెంపకం కోసం, ఆర్అర్ ప్యాకేజిల కోసం మరో రూ.22వేల కోట్ల ఖర్చు జరిగింది. మొత్తంగా ఇప్పటి వరకు రూ.99,643 కోట్ల ఖర్చు జరిగింది. ఈ ఏడాది మార్చి నాటికి మరో రూ.7వేల కోట్లకు పైగా ఖర్చు అవుతుంది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం వరకు రూ.1.07 లక్షల కోట్లకు పైగా వ్యయం జరుగుతుంది. గోదావరి, క ష్ణా బేసిన్లలోని ప్రాజెక్టులతో పాటు, మిషన్ కాకతీయ పనుల కోసం మరో రూ.1.17 లక్షల కోట్లు ఖర్చు అవుతాయని అంచనా. రాబోయే ఐదేళ్లలో ఈ నిధులు ఖర్చు చేసి, ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి, మొత్తం 1.25 కోట్ల ఎకరాలకు సాగునీరు అందించడం ప్రభుత్వ లక్ష్యం. ఈ లక్ష్య సాధన కోసం అధికారులు, ఇంజనీర్లు, వర్క్ ఏజన్సీలు క షి చేయాలి. ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించి, వెంటవెంటనే నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నాం'' అని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు.

''సమైక్య రాష్ట్రంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నీటి పారుదల ప్రాజెక్టులు ఓ జోక్ గా మారాయి. ఎన్నికలప్పుడు ప్రాజెక్టుల పేర్లు చెప్పి ఓట్లు అడుక్కోవడమే తప్ప, ప్రాజెక్టులు కట్టి నీళ్లివ్వలేదు. అత్యధిక వర్షపాతం, పుష్కలమైన నీటి లభ్యత కలిగిన ఆదిలాబాద్ జిల్లా చరిత్ర మార్చాలి. తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించాలి. తమ్మిడిహట్టి బ్యారేజి నిర్మించి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలి. సిర్పూర్ కాగజ్ నగర్ నియోజకవర్గంలో 56,900 ఎకరాలకు, ఆసిఫాబాద్ లో 38,830 ఎకరాలకు, చెన్నూరులో 31,500 ఎకరాలకు, బెల్లంపల్లి నియోజకవర్గంలో 72,770 ఎకరాలకు సాగునీరు ఇవ్వాలి. తమ్మిడిహట్టి వద్ద బ్యారేజి నిర్మించి, 20 టిఎంసిల నీటిని వినియోగించుకోవడానికి సి.డబ్ల్యు.సి. అంగీకారం తెలిపింది. ఈ నీటిని సద్వినియోగం చేసుకుని, ఆదిలాబాద్ జిల్లా రైతులకు సాగునీరు ఇవ్వడానికి సమగ్ర వ్యూహం రూపొందించాలి. ఆదిలాబాద్ జిల్లాలో పారే పెద్దవాగుకు నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుంది. చాలా నియోజకవర్గాల గుండా వెళుతుంది. ఈ పెద్ద వాగు నీటిని వినియోగించుకోవడానికి అవసరమైన నిర్మాణాలు చేపట్టాలి. పెన్ గంగ ప్రాజెక్టుపై నిర్మిస్తున్న చనఖా–కొరటా ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలి. కుప్టి రిజర్వాయర్ నిర్మాణానికి వెంటనే టెండర్లు పిలిచి, పనులు ప్రారంభించాలి'' అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

''తమ్మిడిహట్టి వద్ద బ్యారేజి నిర్మాణం, చనఖా–కొరటా ప్రాజెక్టు, పెద్దవాగు సద్వినియోగం ద్వారా ఆదిలాబాద్ జిల్లాలో చాలా వరకు సాగునీరు అందుతుంది. మిగిలిన భాగానికి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీరు పారుతుంది. కాళేశ్వరం, సీతారామ, దేవాదుల ప్రాజెక్టుల ద్వారా గోదావరి బేసిన్ లో తెలంగాణకున్న వాటాను పూర్తిగా వినియోగించుకోవాలి. ఇటీవలే కాళేశ్వరం ప్రాజెక్టు పనులను నేను స్వయంగా పరిశీలించాను. నీటి పారుదల శాఖ అధికారులు, రిటైర్డ్ ఇంజనీర్లు కూడా ఈ ప్రాజెక్టు పనులను సందర్శించారు. మొత్తం గోదావరి బేసిన్ లో ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించి చేయాల్సిన పనులపై పూర్తి అవగాహన వచ్చింది. ఈ అవగాహనతో ఈ నెలాఖరులోగా కార్యాచరణ ఖరారు చేయాలి. ఫిబ్రవరిలో నేనే స్వయంగా పాలమూరు–రంగారెడ్డి, డిండి ప్రాజెక్టు పనులను పరిశీలిస్తాను. ఫిబ్రవరి మాసంలో క ష్ణా బేసిన్ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేయడంపై కార్యాచరణ రూపొందిస్తాం. వర్షాకాలం వరకు వేగంగా పనులు చేసుకునే అవకాశం ఉంది, కాబట్టి వెంటనే కార్యరంగంలోకి దిగాలి'' అని ముఖ్యమంత్రి సూచించారు.

ప్రాజెక్టుల ద్వారా వచ్చే నీటిని మొట్టమొదట చెరువులకు మళ్లించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ఏడాది కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా అటు మిడ్ మానేరు నుంచి ఎస్.ఆర్.ఎస్.పి వరకు, ఇటు మల్లన్న సాగర్ వరకు నీరు అందుతుందన్నారు. అలా వచ్చిన నీటిని మొదట చెరువులను మళ్లించడానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ప్రాజెక్టు కాల్వలపై తూములు నిర్మించి, చెరువులను నీరు మళ్లించాలన్నారు. ఏదైనా చెరువుకు ఫీడర్ ఛానల్ లేకుంటే, కొత్తగా కాల్వ తవ్వాలని ఆదేశించారు. ఎస్.ఆర్.ఎస్.పి. రెండో దశ వరకు చెరువులు నింపాలని చెప్పారు.

ఎంజాయ్ కోసం గంజాయ్

- మత్తులో తూలుతున్న పాలబుగ్గల పిల్లగాళ్ళు
- ఇల్లూ, ఒళ్ళూ గుల్ల జేసుకుంటున్న బాధితులు
- జోరుగా సాగుతున్న దొంగచాటు అమ్మకాలు
- పెడదారి పడుతూ సైకోలా మారుతున్న యువత
- 30 ఏండ్లకే 70 ఏండ్ల ముసలితనం
- విచ్చలవిడి అమ్మకాలు.. అయినా పట్టించుకోని అధికారులు..

జనగామ జనవరి 18 (మనం న్యూస్ ప్రతినిధి) : 'ఎంజాయ్ కోసం గంజాయ్ గుంజెయ్‌ర మామ మస్తు మస్తు గుంటది..' అంటూ మత్తులోకి జారుకుంటున్న యువత పెద్ద ఎత్తున పెడదారి పడుతూ ఆసుపత్రి పాలవుతోంది. టీనేజ్‌లో యువత పెడదారిన పడుతున్నా అధికారులు సరైన చర్యలు చేపట్టడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జనగామ ప్రాంతంలో గుట్టుమని పదిహేనేండ్లు కూడా నిండని పిల్లలు గంజాయి గుంజేస్తూ.. దుప్పల్లా ఉన్నోళ్లు పీనుగల్లా తయారుకావడంతో తల్లితండ్రులు పెద్దెత్తున అందోళన చెందుతున్నారు. పిల్లలే కాదు, కొంతమంది పెద్దలు కూడా డ్రగ్స్‌కు బానిసలవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.డ్రగ్స్ వల్ల శరీరంలోని అవయవాలు పని చేయకుండా పోవడంతోపాటు, పిల్లలు సైకోలుగా మారుతున్నారు. ఏంచేస్తారో? తెలీకుండా పోతోంది. ఆసమయంలో ఏం ఇలాంటి వారికి సైక్రియాటిస్ట్ చికిత్స తప్పడంలేదు. మత్తుకు మరిగిన వారిని మామూలు మనిషిగా తయారు చేయడానికి చికిత్సకు సుమారుగా 10 నుంచి 20 లక్షల వరకు ఖర్చు అవుతుంది. చికిత్స అనంతరం మరోసారి డ్రగ్స్ వాడితే వారి పని అంతే అని డాక్టర్లు చెప్పి పంపిస్తున్నారు. డాక్టర్ల మాట పెడచెవిన పెట్టి డ్రగ్స్‌కు అలవాటు పడిన వారు మృత్యువాత పడ్డ వారు జిల్లాలో ఎంతోమంది..

జోరుగా సాగుతున్న డ్రగ్స్ దందా..

తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కోకైన్ , వైట్‌నర్, గంజాయి, బ్లాక్ కోబ్రా, కొరెక్స్, కాక్‌టైల్ లాంటి డ్రగ్స్ వ్యాపారం గుట్టు చాటుగా జోరుగా సాగుతుంది. ఇవన్నీ మార్కెట్లో విచ్చల విడిగా దొరకడంతో యువత మరింత అలవాటు పడుతున్నారు. ఇంత జోరుగా సాగుతున్న దందాను ఏ ఒక్క అధికారి మాత్రం కట్టు దిట్టం చేయలేక పోవడం వెనుక ఆంతర్యం ఏందోనని వ్యాఖ్యానిస్తున్నారు జిల్లా వాసులు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలతో పాటు గుట్టుచాటుగా డ్రగ్స్ అమ్మకాలు చేపట్టడంతో బానిసలుగా మారిని వారు నిత్యం ఆ షాపుల్లోనుండి తీసుకెళ్లి ఆరు బయట ప్రాంతాల్లో గుప్పు మనిపిస్తూ మత్తులోకి జారుకుని ఆప్రాంతంలో నివాసం ఉండే వారిని వికృత చేష్టలతో భయభ్రాంతులకు గురిచేయడం తరుచుగా జరుగుతుంది. జనగామ శివారు కాలనీల్లో నివ సించే వారికి రాత్రి వేళల్లో బయటకు వెళ్లాలంటే భయం భయంగా ఉందంటున్నారు. శని , ఆది వారాలు వస్తే చాలు శివారు ప్రాంతాల్లో మద్యం మత్తులో తూగుతూ కాలి నడకన వెళ్లేవారికి చుక్కలు చూపిస్తు టీజింగ్ చేయడం అలవాటుగా మారిపోయింది.

అపరిచితుల్లా ప్రవర్తిస్తున్న డ్రగ్స్ బానిసలు

డ్రగ్స్ మత్తులోఅపరిచితుల్లా ప్రవర్తిస్తూ తెలిసిన వారికి సైతం భయంగొలుపుతున్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడి ఏం చేస్తున్నారో తెలియని పరిస్తితిలో



ఉండడంతో వారి కుటుంబ సభ్యులు శోక సముద్రంలో మునిగి వారిని ఎలా కాపాడెకోవాలో తెలియక ఆసుపత్రి పాలై అటు ఆరోగ్యం , ఇటు డబ్బులు ఖర్చు కావడంతో అర్థికంగా వెనుకబడి ఏమి చేయని స్థితిలో సరైన వైద్యం అందించలేక పోతున్నారు.

డ్రగ్స్ అతి ప్రమాదం : ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు వనం శ్రీనివాస్

డ్రగ్స్ వాడడం వల్ల శరీరంలోని అవయవాలు దెబ్బతిని మనుషులు అస్తిపంజరంలా తయారవుతారు. నరాల బలహీనత ఏర్పడి కాలేయం, ,ప్యాంక్రియాటిస్, ఊపిరితిత్తులు, గుండె దెబ్బతిని శరీరం దేనికీ సహకరించ దు. సైకోలా ప్రవర్తిస్తారు.



జిల్లా ఆసుపత్రి అయినప్పటినుండి ఇప్పటివరకు సుమారుగా డ్రగ్స్ వాడిన 10 మందికి వైద్యం చేసి మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్ ప్రాంతం ఆసుపత్రికి పంపించాం. డ్రగ్స్ వాడిన వారిని చావు వెంబడిస్తున్నట్లే. పిల్లల విషయంలో తల్లి తండ్రులు అతి జాగ్రత్తగా అప్పుడప్పుడు గమనిస్తుండాలి. లేకపోతే ప్రమాదం తప్పదు.







ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ గార్డెన్స్‌లో ఆయన సమాధి వద్ద నివాళులర్పిస్తున్న బాలకృష్ణ, జూ.ఎన్‌టిఆర్, కల్యాణ్‌రామ్, నారా భువనేశ్వరి తదితరులు

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

శనివారం, జనవరి 19

నేడు విపక్షాల బలప్రదర్శన


దేశంలో 'ప్రజాస్వామ్య పరిరక్షణ' పేరుతో నిరంకుశ నరేంద్ర మోదీని గద్దె దించేందుకు 20 ప్రాంతీయ పార్టీలు శనివారం కోల్‌కతాలో బలప్రదర్శనకు సిద్ధమయ్యాయి. దేశవ్యాప్తంగా ఉన్న ప్రాంతీయ పార్టీలతో కలిసి ఐక్యంగా పాల్గొనే ఈ ర్యాలీ కచ్చితంగా బీజేపీకి, నరేంద్ర మోదీకి గట్టి జవాబు ఇవ్వగలదని భాగస్వామ్య పార్టీలు భావిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో అఖిలేశ్ యాదవ్-మాయావతి పార్టీలు చేసుకున్న పొత్తుతో ఇప్పటికే బీజేపీ కలవరం చెందుతోందని ఆ పార్టీ నేతలు చేస్తున్న ప్రకటనల వల్ల తెలుస్తోంది. కోల్‌కతాలో ప్రతిపక్షాల మెగా ర్యాలీ ద్వారా బీజేపీకి వణుకు పుట్టించాలన్నది తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ భారీ ఏర్పాట్లు చేపట్టి దేశంలోని ప్రాంతీయ పార్టీలను ఆహ్వానించారు. ఈ ర్యాలీలో పాల్గొనాలని మమత ఆహ్వానం మేరకు మొదట్లో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అంగీకరించినప్పటికీ ప్రాంతీయ పార్టీలకు చెందిన కొంతమంది నేతల వైఖరి కారణంగా వెనకడుగువేశారని చెబుతున్నారు. ఆయన తరపున ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గె హాజరయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో ఉత్తరప్రదేశ్‌లో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని బీజేపీకి ప్రత్యామ్నాయంగా మాయావతి-అఖిలేశ్ యాదవ్‌లు పొత్తు పెట్టుకున్నారు. ఈ పొత్తుకు కాంగ్రెస్‌ను దూరంగా ఉంచారు. దీనికి తోడు తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు బీజేపీయేతర, కాంగ్రెసేతర ఫ్రంట్ ఏర్పాట్లకు శ్రీకారం చుట్టి కొంతమంది ప్రాంతీయ పార్టీలకు చెందిన నేతలతో మంతనాలు జరుపుతుండడం బీజేపీ యేతర ఫ్రంట్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడి ప్రయత్నాలకు తీవ్ర విఘాతం ఏర్పడిందనే చెప్పుకోవాలి. స్థానికంగా ఉన్న రాజకీయ కారణాలతో కేసీఆర్ ప్రయత్నాలను అఖిలేశ్, మాయావతి స్వాగతించారు. అలాగ బిహార్‌లో కూడా ఆర్‌జేడీతో పొత్తుకు అఖిలేశ్ చేస్తున్న ప్రయత్నాల వల్ల ఇప్పటికే అక్కడ మహాకూటమిగా ఏర్పడిన కాంగ్రెస్, ఆర్‌జేడీల మధ్య ఉన్న పొత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికి బిహార్ మహాకూటమికి ఎటువంటి ఇబ్బందికరమైన వాతావరణం లేకపోయినా ఎన్నికల సమయానికి పొద్దుపొడిచే కొత్తపొత్తుల కారణంగా పరిస్థితులు మారే అవకాశాలున్నాయి.


ఒకవైపు మాయావతి, మరోవైపు మమతా బెనర్జీ, ఇంకొకవైపు ములాయం సింగ్ యాదవ్, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ ప్రభృతులు ప్రధాని సీటుపై కన్నేసి ఉంచారు. వీరికి తోడు కాంగ్రెస్ అధ్యక్షుడి విషయం ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఒకవేళ సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని 150 సీట్లకు అదుపు చేసినప్పటికీ 180-200 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తే ప్రధాని పదవి రాహుల్‌కు అప్పగించేందుకు ఇతర పార్టీలు అంగీకరించే పరిస్థితి కనిపించడం లేదు. ఉత్తరప్రదేశ్‌లో ఒంటరి పోరాటానికి సిద్ధమని కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించింది. వీరి మధ్య ఉన్న అనైక్యతను సొమ్ము చేసుకోవడం తమకు పెద్ద కష్టమైన పనేమీ కాదని బీజేపీ ధీమాగా ఉన్నది.

ఏదేమైనా శనివారం కోల్‌కతాలో జరగనున్న మహార్యాలీలో రాహుల్‌తో పాటు యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ కూడా హాజరైతే పరిస్థితి మరింత క్షీణించే అవకాశాలున్నాయని, తద్వారా విపక్షాలు కూటమి కట్టడం సాధ్యమయ్యే పరిస్థితులు ఉండవని పశ్చిమబెంగాల్ కాంగ్రెస్ పార్టీ నేతల అభిప్రాయం మేరకు పార్టీ సీనియర్ నేతలు ఈ ర్యాలీలో పాల్గొనే అవకాశాలు కనిపించడం లేదు. అంతేగాక పశ్చిమబెంగాల్‌లో లోక్‌సభ ఎన్నికల సమయంలో ఒంటరి పోరుకే స్థానిక కాంగ్రెస్ నేతలు సుముఖంగా ఉన్నారని సమాచారం. అంతేగాక, ఈ ర్యాలీలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఉన్న ప్రాంతీయ పార్టీలకే ప్రాముఖ్యం ఇచ్చేందుకు మమతా బెనర్జీ, టీఎంసీ అధిష్టానం సిద్ధం కావడం కూడా ఈ ర్యాలీకి కాంగ్రెస్ దూరంగా ఉండడానికి మరో కారణంగా చెబుతున్నారు. కాంగ్రెసేతర ఫ్రంట్ ఏర్పాటు చేయాలని మమత స్పష్టంగా చెప్పకపోయినప్పటికీ సార్వత్రిక ఎన్నికల అనంతరం దేశ రాజకీయాలను ప్రాంతీయ పార్టీలే శాసించే స్థాయిలో ఉంటాయని ఆమె గట్టిగా విశ్వసిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, కర్ణాటక ముఖ్యమంత్రులతో పాటు పాటిదార్ నాయకుడు హార్థిక పటేల్, లాలూ ప్రసాద్ కుమారుడు తేజస్వి యాదవ్, డీఎంకే నేత స్టాలిన్, అజిత్ సింగ్, ఫరూఖ్ అబ్దుల్లా ప్రభృతులు ఈ ర్యాలీకి హాజరుకానున్నారు.

మరో ముఖ్యమైన అంశమేమిటంటే - బీజేపీ అసమ్మతి నేతలు శత్రుఘ్న సిన్హా, యశ్వంత్ సిన్హా కూడా హాజరు కావడం బీజేపీకి చెమటలు పట్టిస్తోంది. గత కొంతకాలంగా వీరిద్దరూ బీజేపీ నేతలైనప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీని నేరుగా విమర్శలు చేస్తుండడం, వీరు ఈ ర్యాలీకి హాజరు కావడం బీజేపీ గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లుగా భావించాలి. విపక్షాల్లో ప్రధాని మంత్రి పదవి అభ్యర్థి ఎంపికపై విభేదాలు ఎలా ఉన్నాయో పాలక బీజేపీలో కూడా మోదీ అభ్యర్థిత్వం పట్ల అంతే వ్యతిరేకత ఉందనే భావం దేశంలో పెద్దయెత్తున ప్రచారంలో ఉన్నది. ఈ నేపథ్యంలో ఆర్‌ఎస్‌ఎస్ కూడా మోదీని కాదని ప్రత్యామ్నాయ అభ్యర్థిని అన్వేషిస్తోందని, అందులో భాగంగా విపక్షాలతో సఖ్యతగా ఉండే కేంద్ర రవాణశాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేరును పరిశీలిస్తోందని అంటున్నారు. అదే నిజమైతే ఇప్పుడు ఏకమవుతున్న ప్రాంతీయ పార్టీల్లో కొన్ని తమ దారిని మళ్లించుకుని ఎన్‌డీఏకు మద్దతిచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశంలో అత్యవసర పరిస్థితి విధించి ప్రజలకు అప్పటి ప్రధాని ఇందిరా గాంధీని వ్యతిరేకిస్తూ 1977లో జనతాపార్టీ ఏర్పడినప్పుడు ఎదురైన స్పందన కంటే శనివారం కోల్‌కతా ర్యాలీకి మరింత స్పందన లభిస్తుందని టీఎంసీ ధీమా వ్యకంచేస్తుండడం గమనార్హం. ఒకవేళ ఇదే గనుక ఘన విజయం సాధిస్తే ప్రతిపక్షాలను ఏకం చేయడంలో మమతాబెనర్జీకి, ఆమెకు ఇటీవలి కాలంలో అత్యంత సన్నిహితంగా ఉంటున్న చంద్రబాబు నాయుడికి అనూహ్య మద్దతు లభిస్తుందని రాజకీయ పరిశీలకులు చేస్తున్న ఊహాగానాలకు తగు ప్రాధాన్యం కలుగుతుంది. అందుకే ఈ ర్యాలీని విజయవంతం చేయడంలో వారిద్దరూ ఎంతో శ్రమిస్తున్నారనిపిస్తుంది. ఏతావాతా ఈ ర్యాలీ ఫలితం కచ్చితంగా దేశ రాజకీయాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుందనడంలో సందేహం అక్కరలేదు. బీజేపీ భావిస్తున్నట్టు ఈ ర్యాలీ జయప్రదం అయితే మోదీ, అమిత్ షాలకు చుక్కలు కనిపించక తప్పదు. ఆ విజయమే గడ్కరీ, ఎల్‌కె అద్వానీ వంటి వారికి కచ్చితంగా రాజకీయ ఊపిరినిస్తాయి. దేశమంతా ఎంతో ఆతృతతో ఎదురుచూస్తున్న ఈ ర్యాలీ ఫలితం ఎలాఉంటుందో స్పష్టమవాలంటే వేచివుండాల్సిందే! ప్రధాని అభ్యర్థిత్వానికి వినిపిస్తున్న పేర్లలో కొన్ని ర్యాలీ అనంతరం అదృశ్యమైనా ఆశ్చర్యం లేదు.



మంచిమాట



వేరేవారి తప్పల నుంచి పాఠాలను నేర్చుకో.. ఎందుకంటే అన్నిటినీ నీ సొంత అనుభవంతో నేర్చుకోవడానికి జీవితకాలం సరిపోదు.

- చాణక్యుడు


శ్రమకు తగ్గ కూలీ దక్కాలి

పనిచేసిన వ్యక్తికి పనికి తగ్గ కూలీ ఇవ్వటం సామాజిక లక్షణం. సహజం, కనీస ధర్మం కూడా. అలా కూలీ ఇవ్వని పక్షంలో పనిచేయించుకున్న వ్యక్తి లేదా యజ మాని క్షమార్హుడు కాడు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాలుగున్నరేళ్ళ పరిపాలనా క ష్టానికి రాబోయే 2019 ఎన్నికల్లో తగిన కూలీ ఇవ్వా లని జన్మభూమి గ్రామసభల్లో ప్రజలకు విజ్ఞప్తి చేస్తు న్నారు. సీఎం చంద్రబాబు ఏపీ కొరకు చేసిన పనులు ఏమిటి? ఆయన పనిదినాలు ఎన్ని? ఏ ఏ పనులను చేపట్టారు? ఎన్ని పనులను పూర్తిచేశారు? ఇంకెన్ని పనులను చేస్తున్నారు? అనే ప్రశ్నలకు జవాబులను ఆ ఆ రాష్ట్ర ప్రజలే నిర్ణయించాల్సి ఉంది. ఆయన చేసిన ఆయా పనులను బట్టి సీఎంకు ఎంత కూలీ ఇవ్వాలో కూడా సీమాంధ్రులే నిర్ణయించాల్సిన అంశం. నాలుగున్నరేళ్ళ కాలంలో చంద్రబాబు చేసిన, చేస్తున్న పనులను ఒకసారి పరిశీలిద్దాం.

2014 జూన్ 2వ తేదీన రాష్ట్రపతి ఆమోదంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అధికారికంగా విభజింపబడ్డది. జూన్ 8న చంద్రబాబు తన క్యాబినెట్ మంత్రులతో కలిసి విడిపోయిన నవ్యాంధ్రకు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారానికి ముందే పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ప్రధాన అవరోధంగా ఉన్న తెలంగాణ రాష్ట్రంలోని 7 మండలాలను ఏపీలో కలిపేలా కేంద్ర ప్రభుత్వంచే ఆర్డినెన్స్ ఇప్పించారు. దీనితో పోలవరం నిర్మాణానికి సంబంధించిన ముఖ్యమైన అడ్డంకి తొలగింది. వందేళ్ళ నాటి పోలవరం నిర్మాణ కలకు శ్రీకారం జరిగింది. 16 వేల కోట్ల లోటు బడ్జెట్‌తో పాలనా పగ్గాలు చేపట్టిన చంద్రబాబు విజయవాడలో ఒక చెట్టు కింద బస్సులో ఉంటూ, తొలి పాలనను అమలు చేశారు. 2014 ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన ఋణమాఫీ మాట కోసం రూ. 24,500 కోట్లు రైతు ఋణాలను 5 విడతలుగా మాఫీ చేసేందుకు నడుంకట్టారు. ఇప్పటికి 3 విడతల్లో దాదాపు 15,038 కోట్లను ఋణమాఫీ కింద 57.21 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేశారు. మరో 8 వేల కోట్ల రూపాయలను 2 విడతల్లో చెల్లించేందుకు సంసిద్ధతను ప్రకటించారు. 86.40 లక్షల మంది ఆడపడుచులకు పసుపు కుంకుమల కింద రూ. 10 వేల కోట్లు చెల్లించారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, నేత కార్మికులు, గీత కార్మికులు వంటివారికి పింఛన్లను 5 రెట్లు పెంచారు. వీరితో పాటు చేతి వృత్తులు, మత్స్యకారులు, ఒంటరి మహిళలు, డయాలసిస్ రోగులు, ట్రాన్స్‌జండర్‌లకు మొత్తం 51 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ద్వారా నెలకు రూ. 1,000, రూ. 1,500, రూ. 2,500 వరకు ప్రతినెలా మొదటి తేదీన ఠంచనుగా చెల్లించటం గమనార్హం. రాష్ట్రంలో దాదాపు 54 లక్షల మందికి ఏటా రూ. 6 వేల కోట్లు పింఛన్లుగా అందించటం జరుగుతోంది.

ముఖ్యమంత్రి యువనేస్తం పథకంతో 4,01,008 యువతకు నెలకు రూ. 1,000 నిరుద్యోగ భృతితో పాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నారు. అన్న క్యాంటీన్ల ద్వారా కేవలం రూ.5కు అల్పాహారం, భోజన సదుపాయం కల్పించారు. 35 లక్షల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. బీసీ సంక్షేమానికి రూ.40 వేల కోట్లు కేటాయించి, దేశంలోనే తొలిసారిగా బీసీ సబ్‌ప్లాన్, ఆదరణ 2 పథకం, 90% రాయితీతో ఆధునిక యంత్రాలు, పనిముట్లు అందచేస్తున్నారు. ఎస్సీ సంక్షేమానికి రూ.42,254 కోట్లు, ఎస్టీలకు రూ. 14,210 కోట్లు బడ్జెట్ కేటాయింపులు చేశారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఉపకార వేతనాలు, ఫీజుల చెల్లింపు జరుగుతోంది. కాపు కార్పొరేషన్‌కు ఈ 4 ఏళ్ళలో రూ.3,100 కోట్లు కేటాయించారు. ఎన్టీఆర్ విదేశీ విద్య, జాబ్‌మేళా, ఋణమేళాలు, నైపుణ్య శిక్షణ, కాపు భవనాల నిర్మాణం, కాపు రిజర్వేషన్ల కొరకు రిజర్వేషన్ బిల్లు ఆమోదం వంటి పనులను చేశారు. 213 కోట్లతో చంద్రన్న పెళ్ళి కానుకలు ఇచ్చారు. బీసీలకు 35 వేలు, ఎస్టీలకు 45 వేలు, ఎస్సీలకు 50 వేలు, ముస్లింలకు దుల్హన్ పథకం కింద మరో 50 వేలు ఇస్తున్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌కు గత 4 ఏళ్ళలో 285 కోట్లు కేటాయించారు. పేద బ్రాహ్మణులకు చదువు, ఉపాధితో ఆర్థిక సాయం, పింఛన్లు, స్వయం ఉపాధి కల్పించారు. 18 లక్షల ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీ, వికలాంగుల విద్యార్థులకు రూ. 11,342 కోట్లు స్కాలర్‌షిప్‌లుగా అందించారు. ఎన్టీఆర్ వైద్యసేవల ద్వారా 17.14 లక్షల మంది పేదలకు రూ. 4,758 కోట్లతో ఉచిత వైద్య సేవలు అందించారు. 2.5 కోట్ల అసంఘటిత కార్మికులకు 2 లక్షల నుంచి 5 లక్షల వరకు చంద్రన్న బీమా భరోసా కల్పించారు. ఇప్పటికి 2 వేల కోట్లు చంద్రన్న బీమా క్లెయిమ్స్‌గా చెల్లించారు. రాష్ట్రంలో ప్రతి గ్రామానికి సీసీ రోడ్లు వేయాలనే లక్ష్యంతో రాష్ట్రం మొత్తం 24 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మించారు. క్రిస్టియన్, సంక్రాంతి, రంజాన్ పండుగల కానుకలను పెద్ద ఎత్తున అందచేశారు. ఎన్టీఆర్ హౌసింగ్ కింద 80 వేల కోట్లతో 30 లక్షల ఇళ్ళ నిర్మాణం చేపట్టి, ఇప్పటికి 10 లక్షల ఇళ్ళ నిర్మాణం పూర్తిచేశారు. పట్టణ ప్రాంతాల్లో జి+3 ఇళ్ళను నిర్మిస్తూ ప్రభుత్వ, పోరంబోకు స్థలాల్లో లబ్ధిదారులకు ఇళ్ళ స్థలాలను మంజూరు చేశారు. కృష్ణాజలాలు సకాలంలో రాకపోవటంతో 2016లోనే రూ. 1,600 కోట్ల వ్యయంతో పట్టిసీమ ప్రాజెక్టు నిర్మాణాన్ని నిర్ణీత గడువులోపే పూర్తిచేశారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా గోదావరి నదులను అనుసంధానం చేశారు. రెండు ప్రధాన నదులు అనుసంధానం కావటం దేశంలో ఇదే మొదటిసారి. పట్టిసీమ ద్వారా గోదావరి నీళ్ళను కృష్ణాడెల్టాలోని 13 లక్షల ఎకరాల ఆయకట్టుకు ఇచ్చి, శ్రీశైలం నుంచి కృష్ణాజల్లాలను పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా రాయలసీమకు అందించారు. దీనితో కృష్ణాడెల్టాలో దాదాపు 10వేల కోట్ల పంట దిగుబడులను కాపాడారు. కరువు సీమలోని రైతుల కన్నీళ్ళను తుడవగలిగారు. మరోవైపు పోలవరం నిర్మాణ పనులను కూడా 64 శాతం పూర్తి చేశారు. ఇప్పటికి 10,500 కోట్లు ఖర్చు చేశారు. విభజన చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాల్సి ఉన్నా, ఆ నిధులను సక్రమంగా ఇవ్వకపోవటంతో రాష్ట్ర బడ్జెట్ నుంచే నిధులను కేటాయించి, ప్రాజెక్టు పనుల వేగం పెంచారు. రాష్ట్ర ప్రభుత్వం పోలవరం కోసం ఖర్చుపెట్టిన ఖర్చులో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికి 3 వేల కోట్లు బకాయిగా చెల్లించాల్సి ఉంది. స్పిల్‌వే పనులను కూడా పూర్తి చేసి 550 టన్నుల బరువు కలిగిన తొలి గేటును కూడా సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అమర్చారు. మరోపక్క ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. అమరావతి ప్రాంతంలోని రైతులు ఖరీదు కలిగిన 34 వేల ఎకరాలను ఒక్క రూపాయి ఆశించకుండా రాజధాని నిర్మాణానికి ఇచ్చారు. ఇంతటి అమూల్యమైన కానుకను రైతులు ఇవ్వటానికి ఉన్న ఏకైక కారణం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దక్షత, పరిపాలనా సమర్థత ఒక్కటే. పదేళ్ళపాటు ఏపీకి కూడా హైదరాబాద్ రాజధానిగా ఉన్నా, తొలి అసెంబ్లీ సమావేశాలను కూడా హైదరాబాదులో కాకుండా ఏపీ నుంచే చంద్రబాబు మొదలుపెట్టారు. 2 ఏళ్ళలోనే తాత్కాలిక శాసనసభ నిర్మాణాన్ని పూర్తిచేసి అసెంబ్లీ సమావేశాలను రాజధాని అమరావతిలో ఏర్పాటు చేశారు. ఇప్పుడు సచివాలయం, ముఖ్యమంత్రి కార్యాలయం వంటి నిర్మాణాలను వందల అడుగుల ఎత్తులో ప్రపంచం గుర్తించేలా పనులను చేపట్టారు. వీటితో పాటు కృష్ణానదిపై పవిత్ర సంగమం దగ్గర 1300 కోట్లతో కూచిపూడి నాట్య భంగిమతో ఐకాన్ బ్రిడ్జి, మరో 2,200 కోట్లతో దాములూరు-వైకుంతపురం వద్ద మరో బ్రిడ్జి పనులను చేపట్టారు. కనకదుర్గ ఫ్లై ఓవర్ పనులను 90 శాతం పూర్తి చేశారు. విజయవాడ ప్రజలకు ఇసుమంత ఇబ్బంది లేకుండా ఫ్లైఓవర్ పనులను సక్సెస్ చేశారు. కియా మోటార్స్, హీరో, అపోలో టైర్స్, ఇసుజు, అశోక్ లేల్యాండ్ వంటి దేశ విదేశీ కంపెనీల స్థాపనకు కృషి చేశారు. తద్వారా లక్షల ఉద్యోగాలకు మార్గం సుగమం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలను 43% పెంచారు. కృష్ణ, గోదావరి నదుల పుష్కరాలను ఘనంగా నిర్వహించారు. ఇలాంటివి మరికొన్ని కార్యక్రమాలను శ్రద్ధగా చేశారు. ఇవన్నీ ఒక ఎత్తైతే వీటన్నింటికి మించిన ధీరోధాత్తమైన యుద్ధాన్ని కూడా చంద్రబాబు ప్రకటించారు. మోస గించిన మోదీ ప్రభుత్వంపై తిరగబడ్డారు. విభజన చట్టంలోని ప్రతి హామీని నెరవేర్చాలని, తెలుగువారి

ఇవన్నీ ఒక ఎత్తైతే వీటన్నింటికి మించిన ధీరోధాత్తమైన యుద్ధాన్ని కూడా చంద్రబాబు ప్రకటించారు. మోస గించిన మోదీ ప్రభుత్వంపై తిరగబడ్డారు. విభజన చట్టంలోని ప్రతి హామీని నెరవేర్చాలని, తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టాలని సంకల్పం చేపట్టారు. 5 కోట్ల ఆంధ్ర ప్రజల భవిష్యత్తు కోసం 11 ధర్మపోరాట దీక్షలు చేశారు. ఇటు రాష్ట్రంలోను, అటు కేంద్రంలోను నవ్యాంధ్ర అభివృద్ధే లక్ష్యంగా రోజుకు 18 గంటలు పనిచేశారు. ఇన్ని పనులు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఏపీ ప్రజలు ఎంత కూలీ ఇవ్వాలో నిర్ణయాధికారం సీమాంధ్ర ఓటరు మహాశయులదే. పనిచేసిన వ్యక్తి కూలీ అడగటం ఎంత ధర్మమో, పనికి తగ్గ వేతనం ఇవ్వటం కూడా ప్రజలకు అంతే ధర్మం.



ఆత్మగౌరవాన్ని నిలబెట్టాలని సంకల్పం చేపట్టారు. 5 కోట్ల ఆంధ్ర ప్రజల భవిష్యత్తు కోసం 11 ధర్మపోరాట దీక్షలు చేశారు. ఇటు రాష్ట్రంలోను, అటు కేంద్రంలోను నవ్యాంధ్ర అభివృద్ధే లక్ష్యంగా రోజుకు 18 గంటలు పనిచేశారు. ఇన్ని పనులు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఏపీ ప్రజలు ఎంత కూలీ ఇవ్వాలో నిర్ణయాధికారం సీమాంధ్ర ఓటరు మహాశయులదే. పనిచేసిన వ్యక్తి కూలీ అడగటం ఎంత ధర్మమో, పనికి తగ్గ వేతనం ఇవ్వటం కూడా ప్రజలకు అంతే ధర్మం.

పోతుల బాలకోటయ్య
9849792124

కవిత

ఫ్చ్!

జైళ్ళు లేని దేశాన్ని కలగంటుంటే
దేశం జైలుగా మారిపోతున్నది

ప్రజలకు దేశభక్తిని నూరిపోసి
ప్రభువులు సింహాసనాలను ఆక్రమిస్తున్నారు

సరిహద్దుల్లో ఉద్రిక్తతలు సహజంగానే
ఎన్నికల వేళల్లో ఉధృతమవుతాయి

గుడి లేని రాముడు ఎజెండాలో చేరి
పార్టీల ఉత్థాన పతనాలకు కారణమవుతాడు

ఆకలికి ఆకుల్లా రాలినా ఉలుకూ పలుకూ లేని జనం
మతం పేరెత్తితే చాలు తెగ ఊగిపోతారు

విద్వేషాలకు బుద్ధి తక్కువ
రెచ్చగొట్టడానికి ఒక్క నినాదం చాలు!

స్వాతంత్ర్యం వచ్చాక సైన్యం సరిహద్దుల్లో
యుద్ధాలన్నీ దేశంలోనే!

ప్రణాళికలెన్ని సిద్ధం చేసినా గంగ కాలుష్యం తరగనట్లే
హిత బోధలెన్ని చేసినా కులమతాల మరకలు చెరగవు!

మహాత్ముడా! నీ కల భావనాత్మకం
ఏళ్ళు గడుస్తున్న కొద్దీ దేశ పరిస్థితులు కఠినాత్మకం!

- కోట్ల వెంకటేశ్వర రెడ్డి
94440233261

మన లేఖలు

డేంజర్ జోన్‌లో పత్తిపాక

దేశంలో ఖనిజ సంపదకు కొదవ లేదు. పుష్కలంగా ఉన్న దేశం మనది. ఇక్కడ మైనింగ్ పరిశ్రమ కూడా ముఖ్యమైనదిగానే ఉంది. మైనింగ్ కార్యక్రమాల ప్రభావం వల్ల నీరు, గాలి, భూమి, భూసారం, వృక్ష సమూహం, అటవీ పర్యావరణం మీద మాత్రమే కాకుండా మనుషుల ఆరోగ్యాల మీద, జనవాసాల మీద కూడా చాలా తీవ్ర ప్రభావం చూపుతుందనేది జగమెరిగిన సత్యం. దుమ్ము, ధూళి, వాయువులు, శబ్దాలు మొదలగు వాటి వల్ల వచ్చే ఆరోగ్య సమస్యల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. దేశంలోని సహజ సంపద గురించి మాట్లాడుకున్నట్లుగానే వరంగల్ రూరల్ జిల్లా పరిధిలోని శాయంపేట మండలంలో సహజ సంపదలైన గుట్టలు పుష్కలంగా ఉన్నాయి. ఈ మండలంలోని పత్తిపాక గ్రామం చుట్టుపక్కల కూడా పుష్కలంగా గుట్టల సముదాయం ఉంది. అయితే గత కొన్నేండ్లుగా ఇక్కడ క్రషర్ల నిర్వహణ సాగుతుంది. శాయంపేట మండలానికి పక్కనే ఉన్న ఆత్మకూర్ మండలంలోనూ క్రషర్లు, డాంబర్ ప్లాంట్ల నిర్వహణ సాగుతోంది. సుమారు ఏడువేల పైచిలుకు జనాభా కలిగిన పత్తిపాక గ్రామానికి కూతవేటు దూరంలో గుట్టల సముదాయం ఉంది. గుట్టల పరిసర ప్రాంతమంతా వ్యవసాయ భూములు కావటంతో నిత్యం రైతులు, వ్యవసాయ కూలీలతో పంట పొలాలతో, వాణిజ్య పంటలతో పచ్చదనంగా ఉంటుంది. అయితే ఈ గుట్టల సముదాయంలోనే గ్రామానికి సుమారు రెండున్నర కిలోమీటర్ల దూరంలోని ఓ గుట్టకు క్రషర్ ప్రారంభమైంది. ఆరేండ్ల కిందట ప్రారంభమైన క్రషర్ వల్ల ప్రస్తుతం ఇక్కడి గుట్ట ఆనవాళ్లు కూడా లేవు. గుట్ట అడుగు భాగంలో కిలోమీటర్ నుంచి రెండు కిలోమీటర్ల లోతులో అడుగు భాగం తొలచబడింది. దీనికి తోడు ఇదే స్థానంలో డాంబర్ ప్లాంట్ నిర్వహణకు కూడా క్రషర్ యాజమాన్యం సిద్ధపడటంతో గ్రామానికి భవిష్యత్‌లో అనారోగ్యాన్ని బహుమతిగా ఇవ్వటానికి సంకేతంగా భావించాల్సి వస్తుంది. అయితే వరంగల్ రూరల్ జిల్లాలోని పత్తిపాక క్రషర్, డాంబర్ ప్లాంట్ మైనింగ్ తరహా అంత కాకపోయినప్పటికీ గుట్టలను తరగదీయటం, ఆ ప్రాంతంలోని పర్యావరణానికి, భూభాగానికి, ప్రజల ఆరోగ్యాలకు, పంటలకు, భూగర్భ జలాలు అడుగంటి పోవటానికి కూడా క్రషర్ల నిర్వహణ కారణమవుతుందని గుర్తించాలి. దీనికి తోడు డాంబర్ ప్లాంట్ లాంటి వాటి నుంచి వెలువడే వాయువు మనుషులకు అనారోగ్యాలు తెచ్చి పెట్టవని ఎవరైనా భావించటం వారి చైతన్యానికి, అవగాహనకు సంబంధించిన అంశం. కానీ అంతిమంగా డాంబర్ ప్లాంట్ వల్ల మనుషుల ఆరోగ్యాలకు అనర్థాలు తప్పవని గమనించాలి. పత్తిపాక శివారులో ఒక గుట్ట క్రషర్ నిర్వహణతో కనుమరుగైంది. ఇదే తరహాలో మరో గుట్ట కూడా భవిష్యత్‌లో కనుమరుగు కానుందంటే సందేహించాల్సిన అవసరం లేదు. ఈ లెక్కన పత్తిపాక గ్రామ భవిష్యత్ తరాలకు ఇక్కడ గుట్టలున్నాయనే విషయం కూడా తెలియకుండా పోతుందనటంలోనూ ఆశ్చర్యం లేదు. గుట్టలను కరిగించకుండా, డాంబర్ ప్లాంట్‌లను నిర్వహించకుండా అభివృద్ధి ఎలా సాధ్యం? సంబం ధిత శాఖల అనుమతితోనే వీటిని నిర్వహిస్తున్నారా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. గ్రామ పరిధిలోని గుట్టలను సైతం గ్రామ పంచాయతీల తీర్మానంతో, సంబంధిత శాఖల అనుమతులతో నిర్వహించటానికి అవకాశాలుంటాయి. సంబంధిత శాఖలు గుట్టలను తరిగించే క్రషర్లకు, డాంబర్ ప్లాంట్లకు పర్మిషన్లు ఇవ్వనీయవు కానీ మనుషుల ఆరోగ్యాలను పనంగా పెట్టే విధంగా పర్మిషన్లు ఇవ్వటం ఎంతవరకు సమంజసం? క్రషర్లు, డాంబర్‌ప్లాంట్ల నిర్వహణకు పర్మిషన్లు ఇచ్చే ముందు సంబంధిత శాఖలు ఆ ప్రాంత మనుషులను దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరముంది. సంబంధిత శాఖలు పర్మిషన్లు ఇచ్చారంటూ వ్యవసాయ భూములకు నష్టం చేసే చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి.

- రాజేందర్ దామెర
8096202751

అడవుల ధ్వంసంతో అపార నష్టం

అడవుల ధ్వంసం, సామాజిక వనాల పెంపకంలో అశ్రద్ధ ఫలితంగా అపారమైన నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. అడవుల వినాశనం మూలంగా ప్రకృతి వ్యవస్థలు దెబ్బతిని అకాల వర్షాలు, వరదలు, విపత్తులు సంభవిస్తున్నాయి. అడవుల విస్తీర్ణం పెంపు లక్ష్యంగా 1950 నుంచి వనమహోత్సవ కార్యక్రమం జరుగుతోంది. అప్పటి కేంద్ర వ్యవసాయ, ఆహార శాఖామంత్రి డాక్టర్ కె.ఎన్ మున్షీ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని ఏటా అటవీ యంత్రాంగం నిర్వహిస్తోంది. మొక్కలు నాటడంపై ఉన్న ఆసక్తి వాటిని పెంచడంలో, పరిరక్షించడంలో కనబరచడం లేదు. ప్రభుత్వాల లోపాలు, వ్యవస్థీకృత వైఫల్యాల మూలంగా పచ్చని అడవులకు కడుపుకోత తప్పడం లేదు. పర్యావరణ మంత్రిశాఖ పరిధిలోని జాతీయ అటవీ సర్వే సంస్థ 1987 నుంచి రెండేళ్ళకొకసారి ఉపగ్రహ చాయాచిత్రాల ద్వారా పరిస్థితిని ప్రజల ముందుంచుతోంది. ఇటీవల అది విడుదల చేసిన అటవీ నివేదిక-2017 ప్రకారం దేశవ్యాప్తంగా 21 శాతం భూభాగంలో 7 లక్షలకు పైగా చదరపు కి.మీ. విస్తీర్ణంలో అడవులు ఉన్నాయి. ఈ సంస్థ లెక్కలపై పర్యావరణవాదుల్లో సందేహాలున్నాయి. భూమిపై పచ్చగా కనిపించేదంతా ఉపగ్రహ చాయాచిత్రాలు అడవిగా పరిగణించడం వల్ల వాస్తవ పరిస్థితి అర్థం కావడం లేదన్న అభిప్రాయం ఉంది. భూ వినియోగం, యాజమాన్య హక్కు, భూమి ఎవ్వరికి చెందినది అనే విషయాలేమీ పట్టించుకోకుండా హెక్టారు భూమిలో పదిశాతం మించి పచ్చదనం, దట్టత ఉన్నట్టయితే దానిని అడవిగా జాతీయ అటవీ సర్వే సంస్థ పరిగణిస్తోంది. అటవీ చట్టం ప్రకారం అటవీ శాఖ ప్రకటించిన రిజర్వు, రక్షిత అడవులను మాత్రమే అడవులుగా పరిగణిస్తున్నారు. ఈ లెక్కన సర్వే సంస్థ చూపించే 21 శాతం ప్రాంతాన్ని పూర్తిగా అడవిగా పరిగణించలేం. వాన నీటిని ఒడిసి పట్టడానికి ప్రకృతి ప్రసాదించిన గొప్ప సాధనాలు అడవులు. వీటి ప్రభావం భూమి పైభాగం కంటే వృక్షాలు, వేళ్ళు, ఒండ్రు మట్టితో కలగలిసిన అంతర్భాగంలోనే అధికంగా ఉంటుంది. అలాంటి అడవులు మాత్రమే వర్షపు నీటిని నేలపై మట్టిపొరల ద్వారా సంగ్రహించి భూగర్భ జలాల అభివృద్ధికి దోహదపడతాయి. ఏళ్ళ తరబడి కొనసాగిన నిర్లక్ష్యం మూలంగా దేశంలోని అటవీ రక్షణ వ్యవస్థలు బండబారిపోయాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం కొరవడటం మరో ప్రధానలోపం. వనాల పెంపకానికి కేంద్రం సహా పలు రాష్ట్రాలు ప్రత్యేక కార్యచరణ అమలు చేస్తున్నాయి. హరిత హారం పేరుతో తెలంగాణ ప్రభుత్వం హరిత సైన్యం ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వనం-మనం కార్యక్రమం పేరుతో మొక్కల పెంపకం, సంరక్షణ కార్యక్రమాలను అమలు చేస్తోంది. అయితే ప్రస్తుతం ఉన్న అడవులను పరిరక్షించుకోవడంలో పెద్దగా శ్రద్ధ చూపడం లేదన్న మాట వాస్తవం. ఆంధ్రాలో తీరం వెంబడి ఉన్న అటవీ నేలల్లో వనాలు కనుమరుగైపోయాయి. అటవీ శాఖలో ఏళ్ళ తరబడి ఉద్యోగాలను భర్తీ చేయడం లేదు. కోట్లాది రూపాయలను ఖర్చు పెట్టి అట్టహాసంగా చేపట్టే మొక్కల పెంపకం మొక్కుబడి తంతుగా మిగిలిపోతోంది. ప్రతి మొక్కకి జియో ట్యాగింగ్ చేస్తామన్న పాలకుల హామీలు కార్యరూపం దాల్చాల్సి ఉంది. సమగ్రమైన అటవీ విధానంతో పాటు దాన్ని అమలు చేసేందుకు చిత్తశుద్ధి, తగిన మేరకు నిధుల కేటాయింపు అవసరం. అటవీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయడంతో పాటు అడవుల పెంపకంలో అనాదిగా కీలకపాత్ర పోషిస్తున్న స్థానిక ప్రజల భాగస్వామ్యం పెంచితే సత్ఫలితాలు సమకూరుతాయి. ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు కదలాల్సిన సమయం ఆసన్నమైంది.

- శ్రీనివాస్ చిరిపోతుల
జయశంకర్ భూపాలపల్లి జిల్లా.
96034 71199.

ఫ్లాట్‌గా ముగిసిన మార్కెట్లు

- రోజంతా రేంజ్‌బౌండ్‌లోనే కదలాడిన సూచీలు
- చివరకు 13 పాయింట్ల లాభంతో 36,386కు సెన్సెక్స్
- కేవలం 2 పాయింట్లు పెరిగిన నిఫ్టీ 10,907 వద్ద ముగింపు
- సన్ ఫార్మా 9 శాతం డౌన్, రిలయన్స్ 5 శాతం అప్



ముంబై: దేశీ స్టాక్ మార్కెట్ శుక్రవారం కూడా లాభాల్లోనే ముగిసింది. ఇండెక్స్‌లు లాభపడటం ఇది వరుసగా నాలుగో రోజు. రోజంతా రేంజ్‌బౌండ్‌లో కదలాడిన ఇండెక్స్‌లు చివరకు స్వల్ప లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 13 పాయింట్ల లాభంతో 36,386 పాయింట్ల వద్ద, నిఫ్టీ కేవలం 2 పాయింట్ల లాభంతో 10,907 పాయింట్ల వద్ద క్లోజయ్యాయి. నిఫ్టీ 10,900 స్థాయిని రక్షించుకోగలిగింది. 890 షేర్లు లాభపడితే, 1,632 షేర్లు నష్టపోయాయి. ఇక 161 షేర్ల ధరల్లో ఎలాంటి మార్పు లేదు.

రిలయన్స్ ఇండస్ట్రీస్, విప్రో, కోటక్ మహీంద్రా బ్యాంక్, హిందాల్కో, అదానీ పోర్ట్స్ షేర్లు నిఫ్టీలో టాప్ గెయినర్లుగా నిలిచాయి. అదేసమయంలో సన్ ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్, గెయిల్, ఎల్‌అండ్‌టీ, హెచ్‌పీసీఎల్ షేర్లు టాప్ లూజర్లుగా ఉన్నాయి.

సెక్టోరల్ ఇండెక్స్‌లన్నీ నష్టపోయాయి. ఒక్క ఎనర్జీ విభాగం మాత్రం లాభాల్లో ఉంది. ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్, ఇన్‌ఫ్రా, ఎఫ్‌ఎంసీజీ, ఆటో ఇండెక్స్‌లపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. ఫార్మా ఇండెక్స్ 3 శాతం మేర పడిపోయింది.

రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు దాదాపు 5 శాతం మేర పరుగులు పెట్టింది. విప్రో 3 శాతానికి పైగా పెరిగింది. అదేసమయంలో సన్ ఫార్మా 9 శాతం మేర పతనమైంది. ఈ షేరు ఇంట్రాడేలో 12 శాతానికి పైగా పడిపోయింది. భారతీ ఎయిర్‌టెల్ 6 శాతానికి పైగా క్షీణించింది. గెయిల్ 3 శాతానికి పైగా, హెచ్‌పీసీఎల్ 2 శాతానికి పైగా నష్టపోయాయి.

బీఎస్ఈలో టాప్ గైనర్స్

కంపెనీ	పాయింట్లు	ప్రస్తుత షేర్ ధర
రిలయన్స్	+4.34	రూ. 1,182
కోటక్ మహీంద్రా	+1.41	రూ. 1,237
హెచ్.సి.ఎల్	+1.02	రూ. 964
ఏషియన్ పెయింట్స్	+0.85	రూ. 1,401
ఓఎన్‌జీసీ	+0.79	రూ. 146
వేదాంత	+0.43	రూ. 198

బీఎస్ఈలో టాప్ లూజర్స్

కంపెనీ	పాయింట్లు	ప్రస్తుత షేర్ ధర
సన్ ఫార్మా	-8.52	రూ. 390
భారతీ ఎయిర్‌టెల్	-6.42	రూ. 310
లార్సెన్ టూబ్రో	-2.07	రూ. 1,318
యాక్సిస్ బ్యాంకు	-1.77	రూ. 664
ఎస్ బ్యాంకు	-1.59	రూ. 198
టాటా మోటార్స్	-1.17	రూ. 96
ఐటీసీ	-0.95	రూ. 291

ఎన్ఎస్ఈలో టాప్ గైనర్స్

కంపెనీ	పాయింట్లు	ప్రస్తుత షేర్ ధర
రిలయన్స్	+4.40	రూ. 1,184
విప్రో	+3.21	రూ. 346
కోటక్ మహీంద్రా	+1.66	రూ. 1,240
హిందాల్కో	+1.36	రూ. 208
అదానీ పోర్ట్స్	+1.22	రూ. 399
హెచ్.సి.ఎల్	+1.22	రూ. 966
ఓఎన్‌జీసీ	+1.21	రూ. 146

ఎన్ఎస్ఈలో టాప్ లూజర్స్

కంపెనీ	పాయింట్లు	ప్రస్తుత షేర్ ధర
సన్ ఫార్మా	-8.39	రూ. 21,162
భారతీ ఎయిర్‌టెల్	-6.29	రూ. 288
గెయిల్	-3.08	రూ. 193
లార్సెన్ టూబ్రో	-2.09	రూ. 493
హెచ్.పి.సి.ఎల్	-1.92	రూ. 741
యాక్సిస్ బ్యాంకు	-1.78	రూ. 214
బజాజ్ ఫినాన్స్	-1.72	రూ. 350

సరికొత్త క్యామ్‌రీ కారు

- 2019 క్యామ్‌రీ హైబ్రిడ్ మోడల్ ఆవిష్కరించిన కంపెనీ
- ధర రూ.36.95 లక్షల నుంచి ప్రారంభం
- అగ్రెసివ్ లుక్, ఆకట్టుకునే డిజైన్ దీని సొంతం

పాన్ కార్ల తయారీ కంపెనీ టయోటాకు చెందిన ఫ్లాగ్‌షిప్ సెడాన్ కారే క్యామ్‌రీ. కంపెనీ ఇందులో 2019 మోడల్‌ను భారత్ మార్కెట్‌లో ఆవిష్కరించింది. టయోటా క్యామ్‌రీలో ఇది ఎనిమిదవ జనరేషన్ వేరియంట్. దీని ఢిల్లీ షోరూమ్ ప్రారంభ ధర రూ.36.95 లక్షలు. ఈ మోడల్‌ను కొత్త డిజైన్‌తో మార్కెట్‌లోకి తీసుకువస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది. టయోటా న్యూ గ్లోబల్ ఆర్కిటెక్చర్ ప్లాట్‌ఫామ్ ఆధారంగా కొత్త క్యామ్‌రీ రూపొందింది. అగ్రెసివ్ లుక్, ఆకట్టుకునే డిజైన్ దీని సొంతం.



సరికొత్త క్యామ్‌రీ కారులో కొత్త లుక్, రీడిజైన్ ఇంటీరియర్, శక్తివంతమైన ఇంజిన్ వంటి ప్రత్యేకతలున్నాయి. 8 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, 9 స్పీకర్ జేబీఎల్ డాల్బే ఆడియో సిస్టమ్ వంటి ఫీచర్లున్నాయి.

కారులో 2.5 లీటర్ 4 సిలిండర్ హైబ్రిడ్ ఇంజిన్‌ను అమర్చినట్లు కంపెనీ తెలిపింది. దీని మాగ్జిమమ్ పవర్ 176 బీహెచ్‌పీఏ 5,700 ఆర్‌పీఎం. అలాగే పీక్ టార్క్ 221 ఎన్‌ఎం ఏ 3,600-5,200 ఆర్‌పీఎం. కారులో ఆరు గేర్లు ఉంటాయి. ఈ కొత్త క్యామ్‌రీ హైబ్రిడ్ కారు లీటరుకు 23.27 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుందని కంపెనీ తెలిపింది.

సన్ ఫార్మా షేరు ధమాల్..

- 6 ఏళ్ల కనిష్టానికి పతనం
- ఇంట్రాడేలో ఏకంగా 12 శాతానికి పైగా క్షీణత
- సెన్సెక్స్‌లో టాప్ లూజర్ ఇదే
- ఫార్మా ఇండెక్స్‌పై ప్రతికూల ప్రభావం

న్యూఢిల్లీ: ఫార్మా దిగ్గజం సన్ ఫార్మా షేరు శుక్రవారం భారీగా పతనమైంది. ఇంట్రాడేలో ఏకంగా 12 శాతానికి పైగా పడిపోయింది. దీంతో షేరు 6 ఏళ్ల కనిష్ట స్థాయికి క్షీణించింది. సన్ ఫార్మా షేరు పడిపోవడంతో ఫార్మా ఇండెక్స్ కూడా పతనమైంది. సెన్సెక్స్‌లో ఇదే టాప్ లూజర్‌గా నిలిచింది. సన్ ఫార్మాతో పాటు యస్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌యూఎల్, యాక్సిస్ బ్యాంక్, ఎంఅండ్‌ఎం, కోల్ ఇండియా, ఏసియన్ పెయింట్స్, టాటా మోటార్స్, టీసీఎస్ కూడా నష్టపోయాయి. ఇవి 1.49 శాతం మేర క్షీణించాయి.

మరోవైపు ఓఎన్‌జీసీ, పవర్ గ్రిడ్, ఆర్‌ఐఎల్, వేదాంత, మారుతీ సుజుకీ షేర్లు టాప్ గెయినర్లుగా ఉన్నాయి. దాదాపు 1 శాతం మేర పెరిగాయి.

సన్ ఫార్మా నుంచి ఎలాంటి ప్రకటనలు లేకపోయినప్పటికీ షేరు ఈ స్థాయిలో పడిపోవడం గమనార్హం. అయితే మనీలైఫ్ మేగజైన్ ప్రకారం.. 2014 నుంచి 2017 మధ్యకాలంలో ఆదిత్య మెడిసేల్స్ కంపెనీ.. సన్ ఫార్మా సహ వ్యవస్థాపకుడు సుధీర్ విలియాకు నియంత్రణలోని సురక్ష రియల్టీ మధ్య రూ.5,800 కోట్లకుపైగా లావాదేవీలు జరిగాయని, ఈ అంశంపైనే ఒక వ్యక్తి సెబీకి ఫిర్యాదు చేశారు. ర్యాన్‌బాక్సీ ఇన్‌సైడర్ ట్రేడింగ్‌పై సెబీకి ఫిర్యాదు చేసిన వ్యక్తే సన్ ఫార్మాపై తాజాగా ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

నికరంగా చూస్తే విదేశీ ఇన్వెస్టర్లు గురువారం రూ.842 కోట్ల మేర ఇన్వెస్ట్ చేశారు. దేశీ ఇన్వెస్టర్లు రూ.727 కోట్లు వెనక్కు తీసుకున్నారు. మరోవైపు శుక్రవారం రూపాయి 18 పైసలు క్షీణించింది. అమెరికా డాలర్‌తో పోలిస్తే 71.21 వద్ద ట్రేడవుతోంది. బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ధర 0.88 శాతం పెరుగుదలతో 61.72 వద్ద కదలాడుతోంది.

ఆసియా మార్కెట్ల విషయానికి వస్తే.. హాంగ్ కాంగ్ ఇండెక్స్ హాంగ్ సెంగ్ 0.94 శాతం, షాంఘై కంపొసైట్ 0.79 శాతం, కొస్పి 0.55 శాతం, జపాన్ నికాయ్ 1.26 శాతం ర్యాలీ చేశాయి. దేశీ స్టాక్ మార్కెట్ శుక్రవారం లాభాల్లోనే ప్రారంభమైంది. అయితే తర్వాత నష్టాల్లోకి జారుకుంది.



ఆ రంగు కార్లంటేనే భారతీయులకు మక్కువ..

- ఏకంగా 43 శాతం మంది ఓటు వీటికే
- మన్నిక, భద్రత వంటి అంశాల కారణంగా ఆ రంగు వైపు చూపు

ఒక్కొక్కరికి ఒక్కొక్క రంగు అంటే ఇష్టముంటుంది. వస్తువులైనా, దుస్తులైనా, వాహనాలైనా, స్మార్ట్‌ఫోన్స్ అయినా నచ్చిన రంగులో ఉంటేనే వాటిని ఎంచుకోవడానికి మొగ్గు చూపుతాం. ఇదంతా ఇప్పుడు ఎందుకంటే.. భారత్‌లో ఎక్కువ మంది ఇష్టపడే కార్ల రంగు ఏదో తెలుసుకునేందుకు జర్మనీకి చెందిన రసాయన సంస్థ బీఏఎస్ఎఫ్ ఒక సర్వే నిర్వహించింది. అందులో ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. అవేంటో చూద్దాం..

భారతీయులకు తెలుపు రంగు కార్లంటే భలే ఇష్టమట. ఇళ్లలో తెలుపు రంగు కార్లే ఉండాలని కోరుకుంటున్నారు. 2018లో 43 శాతం మంది తెలుపు రంగునే ఎంచుకున్నారు. తెలుపు తర్వాత గ్రే (15 శాతం), సిల్వర్ (15 శాతం) రంగుల వైపు మొగ్గుచూపారు. వీటి తర్వాతి స్థానంలో ఎరుపు (9 శాతం), నీలం (7 శాతం), నలుపు (3 శాతం) రంగులు ఉన్నాయి.



స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్ (ఎస్‌యూవీ) కార్ల విషయంలో కూడా 41 మంది తెలుపు రంగు వైపే మొగ్గు చూపుతున్నారు. అలాగే కాంపాక్ట్ సెగ్మెంట్, కాంపాక్ట్ ప్రీమియం సెగ్మెంట్ల విషయంలో కూడా ఈ రంగుదే పైచేయి.

రంగు ఎంపిక అనేది కస్టమర్ వ్యక్తిత్వం మీద ఆధారపడి ఉంటుంది. వ్యక్తిగత అభిప్రాయం ఆధారంగానే కారు రంగు ఎంచుకుంటారు. కారు రంగు అనేది డిజైన్ మీద కూడా ఆధారపడి ఉంటుంది. ఒక మాదిరే కార్లకు కూడా అన్ని రంగులు కుదరవు. ఒక కారుకు ఒక రంగు కరెక్ట్‌గా సరిపోతుంది. అదే రంగు మరొక కారుకు సరిపోకపోవచ్చు.

లుపు రంగు ఎక్కువ కాలం మన్నికకు వస్తుంది. దీని నిర్వహణ కూడా సులభం. నలుపు రంగు కార్ల మీద దుమ్ము పడినా కూడా పెద్దగా కనిపించదని భావిస్తే పొరపాటే. తెలుపు రంగు కార్ల కన్నా నలుపు రంగు కార్ల మీదే మరకలు స్పష్టంగా కనిపిస్తాయి.

ఎన్ని సంవత్సరాలైనా కార్లు కొత్త వాటిలాగే ఉంటాయనే కారణంతో కస్టమర్లు చాలా మంది తెలుపు రంగును ఎంచుకోవడానికి ఇష్టపడతారు. అలాగే తెలుపును విలాసవంతమైన రంగుగా కూడా పరిగణిస్తాం. తెలుపు రంగు కార్లు పాపులర్ అవటానికి మరొక కారణం భద్రత. ఇవి రోడ్లపై బాగా కనిపిస్తాయి. ప్రత్యేకించి రాత్రి సమయాల్లో ఇతర వాహనాల డ్రైవర్ల కళ్లకు ఇవి స్పష్టంగా కనిపిస్తాయి. అందుకే నలుపు రంగు కార్ల కన్నా తెలుపు రంగు కార్లు తక్కువగా ప్రమాదాలకు గురికావడాన్ని గమనిస్తూ ఉంటాం. అంతేకాకుండా ఎండా కాలంలో నలుపు, డార్క్ కలర్ కార్ల లోపల వేడిగా ఉంటుంది. కానీ తెలుపు రంగు కార్లలో మాత్రం ఇలా ఉండదు. తెలుపు రంగుకు ఉష్ణాన్ని పరావర్తనం చెందించే గుణం ఉంటుంది.

డిజిటల్ కార్డ్స్ మాయాజాలం

నిత్యంగా జరిపే బ్యాంకు లావాదేవీలన్నీ ఇప్పుడు.. డిజిటల్ కార్డ్ రూపంలో నిర్వహించడం అనేది సర్వసాధారణమైంది. చిన్నపాటి కిరాణాషాపులు మొదలుకొని.. షాపింగ్‌మాల్స్ వరకూ నోట్లతో పనిలేకుండా.. స్వైపింగ్ మిషన్లతోనే లావాదేవీలన్నీ జరుగుతున్నాయి. ఇలా ప్రతి చిన్న అవసరానికీ నోట్లకు బదులుగా డెబిట్, క్రెడిట్ కార్డ్‌లు ఉపయోగంలోకి వచ్చేశాక.. అలా ఉపయోగించే డిజిటల్ కార్డ్‌ల భద్రతా చాలా కీలకంగా మారింది. మనం వాడుతున్న కార్డ్‌లను మనకు తెలియకుండానే ఆర్థిక నేరగాళ్ళు పునఃప్రతిష్ఠ చేసి.. ఖాతాదారుల అకౌంట్లోంచి డబ్బులు దోచుకుంటున్న సంఘటనలు నిత్యం ఎక్కడో ఒకచోట జరుగుతున్నాయి. ఇందుకు కారణాలేంటి? డెబిట్, క్రెడిట్ కార్డ్‌ల వాడుక విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

ఒకప్పుడు డబ్బులు డ్రా చెయ్యాలంటే కచ్చితంగా బ్యాంకులకు వెళ్లి అంతో ఇంతో సమయం కేటాయిస్తేగానీ కుదిరేదికాదు. కానీ టెక్నాలజీ తీసుకొచ్చిన సౌలభ్యం కారణంగా బ్యాంకింగ్ రంగాల్లో వచ్చిన పెనుమార్పుల కారణంగా దాదాపు దశాబ్దంన్నర కిందటే ''ఏటిఎమ్ కార్డ్'' వాడుక ఊపందుకుంది. దీంతో కుబేరుల నుంచి మొదలుకుని రోజువారీ పనులు చేసుకునే కూలీల వరకూ డెబిట్ కార్డ్ వినియోగం అనేది తప్పనిసరిగా మారిపోయింది. అయితే సౌకర్యాలతోపాటు ప్రమాదాలూ పొంచి ఉంటాయన్నది జగమెరిగిన సత్యం. మన జేబులో చెయ్యి పెట్టకుండానే డెబిట్, క్రెడిట్ కార్డులు మాయం చేసేస్తున్న రోజులివి.



మనిషిని పోలిన మనుషులు ఉంటారని ఎలా చెబుతారో.. సరిగ్గా మన డెబిట్ కార్డ్ లేదా క్రెడిట్ కార్డ్‌ని పోలిన కార్డులూ ఉంటాయి. ఏంటి మీకు నమ్మబుద్ధి కావడంలేదా?! శతకోటి దరిద్రాలకి అనంతకోటి ఉపాయాలన్న ట్టు దొంగతనాలకు పాల్పడేవారికి.. టెక్నాలజీ వారి భుజాన వేలాడే ఓ ఆయుధంగా మారిపోతుంది. వాటి ఆసరాగా మనకు తెలియకుండానే మనకు సంబంధించిన మనీ ట్రాన్స్‌మిషన్ కార్డ్స్ (ఏటిఎమ్, క్రెడిట్) ను తయారుచేసుకుని, క్షణాల్లో మన అకౌంట్లోంచి డబ్బులు కాజేస్తారు.

నకిలీ కార్డ్స్

అసలు కార్డ్‌కి నకిలీ కార్డులను తయారుచేస్తారు. దీనినే క్లోనింగ్ చేయడం అంటారు. మన దగ్గరున్న డెబిట్, క్రెడిట్ వంటి ఆర్థిక లావాదేవీలు నెరపే కార్డులు మూడోచేతికి అందినప్పుడు.. కార్డ్ నెంబర్లను డూప్లికేట్ చేసే మిషన్లో దొంగచాటుగా స్వైప్ చేసి, పిన్ నెంబర్‌ని కాజేసి, వాటి ఆధారంగా కొత్తకార్డు స ష్టించి, ఆ కార్డుతో మనకు తెలియకుండానే మన అకౌంట్‌కి చిల్లుపెట్టే సంఘటనలు ఈ మధ్యకాలంలో తరచూ జరుగుతున్నవే.

వెంటాడే దొంగలు

మీరు ఏదైనా ఏటిఎమ్ సెంటర్లో డబ్బులు డ్రా చేస్తున్న సమయంలో పక్కపక్కనే నిలబడేందుకు ప్రయత్నిస్తున్నా.. మీరు టైప్ చేసే పిన్ నెంబర్లను గుర్తుపెట్టుకునేంత దగ్గరలో నిలబడి ఉన్నా, లేదా మీరు పిన్ నెంబర్ టైప్ చేస్తున్నప్పుడు అదేపనిగా గమనిస్తున్నా మన అకౌంట్‌కి ఏదో ప్రమాదం పొంచి ఉన్నట్టే. అలా చూసిన వ్యక్తికి సంబంధించిన మరొకవ్యక్తి మన నుంచి ఏటిఎమ్ కార్డ్ లేదా మన కార్డులు ఉంచిన పర్సు కాజేసే అవకాశం ఉంది. అలాగే కొన్ని ఏటిఎమ్ మిషన్లు నెట్‌వర్క్ నెమ్మదిగా ఉండటం కారణంగా అంతకుముందు లావాదేవీలు జరిపిన పిన్‌నెంబర్ స్టేటస్‌తోనే కొన్ని సెకన్లు, నిముషాలపాటు కొనసాగుతుంటుంది. ఈ విషయాన్ని పసిగట్టే దొంగలు కార్డ్‌స్వైప్ చేయకుండానే విత్‌డ్రా ఆప్షన్ సెలెక్ట్ చేసి.. డబ్బులు డ్రా చేసుకునే సంఘటనలూ అనేకం జరుగుతున్నాయి.

వ్యాలెట్‌లు-జాగ్రత్తలు

సాధారణంగా ప్రయాణాల్లో ఉన్నప్పుడు పొరపాటున జేబులో పర్స్ పోగొట్టుకున్నప్పుడు.. అందులో ఉన్న డబ్బులతోపాటు, రోజువారీగా వినియోగిస్తున్న బ్యాంకు కార్డ్‌లనూ పోగొట్టుకునే అవకాశం ఉంది. పర్స్ పోయిన కొద్ది సేపట్లోనే అంటే పిన్ నెంబర్ బ్లాక్ చేయించేందుకు తీసుకునే కొద్దిపాటి సమయంలోనే అకౌంట్ నుంచి డబ్బులు డ్రా చేసినట్టు బ్యాంకు నుంచి అలర్ట్ మెసేజ్ వచ్చిన సంఘటనలూ జరుగుతున్నాయి. దీనికీ కారణం ఉంది. చాలా మంది తమ పుట్టిన సంవత్సరాన్ని కార్డ్ పిన్ నెంబర్‌గా (పాస్వర్డ్) పెట్టుకుంటారు. ఉదాహరణకు 1976, 1968 ఇలా. అలాగే కార్డ్ ఉంచే కవర్‌పై ఎక్కడో ఒకచోట చిన్న చిన్న అక్షరాలతో పిన్ నెంబర్ గుర్తుకోసం వేస్తుంటారు. ఆధార్, ఓటరు గుర్తింపు కార్డ్ వంటివీ కొంతమంది పర్సుల్లో క్యారీ చేస్తుంటారు. ఇవన్నీ పర్సు దొరికిన, కాజేసిన వ్యక్తులకు మేలు చేసే అంశాలు. ఈ విషయాలన్నింటిపై అవగాహన కలిగిన దొంగలే ప్రత్యేకించి ఏటిఎమ్ కార్డ్‌ల చోరీకి పాల్పడుతుంటారు.


షాపింగ్ చేసేవేళ

మార్కెట్లో చిన్న చితకా వస్తువుల్ని కొనడానికీ కరెన్సీ స్థానంలో 'కార్డ్స్' వినియోగమే ఎక్కువ. మార్కెట్స్, సూపర్ బజార్లు, షాపింగ్ మాల్స్, చివరికి వైన్ షాపుల్లోనూ డెబిట్, క్రెడిట్ కార్డ్‌లను వాడడం సర్వసాధారణమైంది. అయితే ఇలాంటి చోట్లా మన కార్డ్ పిన్ నెంబర్లు చేతులు మారిపోతున్నాయి. సాధారణంగా షాపింగ్ మాల్స్‌లో కొన్న వస్తువులకు బిల్లు చెల్లించేటప్పుడు డెబిట్, క్రెడిట్ కార్డుల్ని అందజేస్తుంటాం. మిషన్‌పై కార్డ్‌ను స్వైప్ చేసుకుని, మనతో పిన్ నెంబర్ టైప్ చేయించి, డబ్బులు జమ కట్టుకుంటారు. కార్డ్‌పై ఉన్న మాగ్నెటిక్ స్ట్రయిప్ సమాచారం ద్వారా సంబంధిత బ్యాంకు నుంచి డబ్బులు జమ అవుతుంటాయి. అయితే ఇలా కార్డ్ స్వైప్ చేసే క్రమంలో కార్డ్ సమాచారాన్ని డూప్లికేట్ చేసుకోడానికి అనేక చోర మార్గాలున్నాయి. పిన్ నెంబర్ టైప్ చేసినప్పుడు అందులో అమర్చిన హిడెన్ మిషన్ (రహస్య యంత్రం) పిన్ నెంబర్‌తో సహా కార్డ్‌కి సంబంధించిన పూర్తి సమాచారాన్ని రికార్డ్ చేసుకోవచ్చు.

అంబానీతో పోటీకి సై అంటున్న అదానీ!

- పెట్రో కెమికల్స్ విభాగంలోకి అదానీ గ్రూప్
- రూ.16,000 కోట్లతో గుజరాత్‌లో ప్లాంటు ఏర్పాటుకు రెడీ
- ఇందుకోసం జర్మనీకి చెందిన బీఏఎస్ఎఫ్ భాగస్వామ్యం

ముంబై: బిలియనీర్ గౌతమ్ అదానీ సారథ్యంలోని అదానీ గ్రూపు పెట్రో కెమికల్స్ విభాగంలోకి అడుగుపెడుతోంది. జర్మనీకి చెందిన కెమిలక్స్ దిగ్గజం బీఏఎస్ఎఫ్ జత కలిసింది. బీఏఎస్ఎఫ్ భాగస్వామ్యంతో ప్లాంటును ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది. ఇందుకు ఇరు సంస్థలు రూ.16,000 కోట్ల మేర పెట్టుబడి పెట్టనున్నాయి. గుజరాత్‌లోని ముంద్రా జిల్లాలో పెట్రో కెమికల్స్ ప్లాంటును నెలకొల్పుతున్నట్లు అదానీ గ్రూపు, బీఏఎస్ఎఫ్‌లు ఓ సంయుక్తంగా పేర్కొన్నాయి.



ఇరు సంస్థలు కొత్తగా ఏర్పాటు చేయనున్న ప్లాంటు విద్యుత్ అవసరాలు తీర్చేందుకు ఇదే ప్రాంతంలో సౌర, పవన విద్యుత్ ప్లాంటును కూడా ఏర్పాటు చేయనున్నాయి. ప్రతి పాదిత పెట్రో కెమికల్స్ ప్లాంటు లో బీఏఎస్ఎఫ్‌కు మెజార్టీ వాటా ఉండనుంది. గుజరాత్‌లో జరుగుతోన్న వైబ్రాంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్ 2019ను పురస్కరించుకుని బీఏఎస్ఎఫ్ ఎస్ఈ, అదానీ గ్రూప్ మధ్య డీల్‌కు సంబంధించి అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది.

కొత్త ప్లాంటులో బీఏఎస్ఎఫ్ ఎంత మేర పెట్టుబడి పెట్టనుందో వెల్లడికానప్పటికీ, భారత్‌లో ఆ సంస్థ పెట్టబోతున్న అత్యధిక పెట్టుబడి ఇదే కానుంది. విద్యుత్ ప్లాంట్లలో మాత్రం బీఏఎస్ఎఫ్ మైనార్టీ వాటాను కలిగి ఉంటుంది. ఇంతకుమించి ప్లాంటుకు సంబంధించి మిగతా వివరాలను ఇరు సంస్థలు వెల్లడించలేదు.

ప్రస్తుతం దేశీయంగా పెట్రో కెమికల్స్ విభాగంలో ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ అగ్రగామి సంస్థగా ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు గౌతమ్ అదానీ కూడా పెట్రో కెమికల్స్ విభాగంలో అడుగుపెట్టడంతో గుజరాత్‌కు చెందిన ఇద్దరు దిగ్గజ పారిశ్రామికవేత్తలు ప్రత్యక్షంగా పోటీ పడుతున్న మొట్టమొదటి వ్యాపార విభాగంగా ఇది నిలవనుంది.


● బాలకృష్ణ

వారం ఆలస్యంగా మహానాయకుడు

దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ బయోపిక్ 'యన్.టి.ఆర్'ను రెండు భాగాలుగా రూపొందించారు. అందులో తొలిభాగం 'యన్.టి.ఆర్ కథానాయకుడు' ఈ సంక్రాంతి సందర్భంగా జనవరి 9న విడుదలైంది. ఇందులో ఎన్టీఆర్ సినీ రంగంలో సూపర్‌స్టార్‌గా ఎలా ఎదిగారు.. ఆయన రాజకీయాల్లోకి ఎందుకువచ్చారు? అనే అంశాలను చూపించారు. ఇప్పుడు ఎన్టీఆర్ రాజకీయ ప్రస్థానం.. అందులో ఆయన ముఖ్యమంత్రిగా అధికార పీఠాన్ని ఎలా చేజిక్కించుకున్నారు? ఆగస్ట్ సంక్షోభం ఏర్పడినప్పుడు మళ్లీ ముఖ్యమంత్రి పదవిని ఎలా దక్కించుకున్నారనే అంశాల వరకు 'యన్.టి.ఆర్ మహానాయకుడు'లో చూపించబోతున్నారు. ఈ సినిమాను ఫిబ్రవరి 7న విడుదల చేయబోతున్నామని ప్రకటించారు. కానీ ప్యాచ్ వర్క్ పూర్తి చేసి దానికి సంబంధించిన పనులు పూర్తి చేసే లోపు సమయం పడుతుంది కాబట్టి సినిమాను ఓ వారం పాటు వాయిదా వేశారని.. ఫిబ్రవరి 14న సినిమాను విడుదల చేసే అవకాశాలున్నాయని సినీ వర్గాల సమాచారం.

45 రోజులు ఎడారిలో...


● గోపిచంద్

హీరో గోపీచంద్ మరో యాక్షన్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల్ని అలరించడానికి సిద్ధమవుతున్నారు. ఆయన తాజాగా నటిస్తున్న సినిమా షూటింగ్ కోసం రాజస్థాన్ పయనమవుతున్నారు. తిరు దర్శకత్వంలో ఎ.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అజయ్ సుంకర, అభిషేక్ అగర్వాల్ సహ నిర్మాతలు. ఈ సినిమా తొలి షెడ్యూల్ చిత్రీకరణ రాజస్థాన్‌లో జై సల్మేర్‌లో ఈ నెల 21న మొదలవుతుంది. దాదాపు 45 రోజులపాటు ఈ షెడ్యూల్ ఉంటుంది. ముఖ్యంగా అక్కడి ఎడారిలో యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తారు. ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్లు ఉంటారు. వాళ్ళిద్దరూ ఎవరనేది త్వరలోనే తెలుస్తుంది. ప్రస్తుతం చిత్ర యూనిట్ హీరోయిన్స్ కోసం అన్వేషిస్తోంది. విశాల్ చంద్రశేఖర్ స్వరాలు సమకూర్చుతున్న ఈ సినిమాకు మాటలు: అబ్బూరి రవి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిషోర్ గరికపాటి.


● తమన్నా

'దట్ ఈజ్ మహాలక్ష్మి' షూటింగ్ పూర్తి

తమన్నా ప్రధాన పాత్రలో నటిస్తున్న దట్ ఈజ్ మహాలక్ష్మి షూటింగ్ పూర్తి చేసుకుంది. సాధారణ యువతి నుంచి అసాధారణ మహిళగా ఎలా మారుతుందనే కథతో దటీజ్ మహాలక్ష్మి సినిమా తెరకెక్కు తుంది. ఈ మధ్యే విడుదలైన టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. అమిత్ త్రివేది ఈ చిత్రానికి సంగీతం అందిస్తు న్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులతో బిజీగా ఉంది. త్వరలోనే చిత్రయూనిట్ విడుదల తేదీని ప్రకటించనుంది. మైఖెల్ ట్యాబ్యురియస్ ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. టైజాన్ ఖొరాకివాలా ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. మెడైంటే ఇంటర్నేషనల్ బ్యానర్‌పై మను కుమరన్ ప్రొడక్షన్‌లో ఈ చిత్రం నిర్మాణం జరుపుకుంటోంది. నటి పరుల్ యాదవ్ ఈ చిత్రానికి సహ నిర్మాత.

క్యారెక్టర్ డిమాండ్ చేస్తే...


● మాధవన్

తాము చేసే క్యారెక్టర్ కోసం ఎలాంటి రిస్కయినా తీసుకోవడానికి కొందరు నటీనటులు సిద్ధమవుతుంటారు. అలాంటి వారిలో మాధవన్ ఒకరు. 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' అనే సినిమాలో తాను చేస్తున క్యారెక్టర్ కోసం 14 గంటలపాటు మేకప్‌తో కుర్చీలోనే కూర్చున్నారు మాధవన్. ఇస్రో మాజీ శాస్త్రవేత్త నంబి నారాయణన్ జీవితం ఆధారంగా తమిళ్, హిందీ, తెలుగు భాషల్లో ఈ సినిమా రూపొందుతోంది. మాధవన్ ఈ సినిమాలో నటిస్తూ దర్శకత్వం కూడా వహిస్తున్నారు. ఈ సినిమాకి మరో దర్శకుడు అనంత్ మహదేవన్. ''నంబి నారాయణన్ పాత్ర కోసం రెండేళ్లు కష్టపడ్డాం. ఇప్పుడు ఈ సినిమాలోని నా పాత్ర లుక్ కోసం కుర్చీలో పద్నాలుగు గంటలు కూర్చుండిపోవాల్సి వచ్చింది'' అని పేర్కొన్నారు మాధవన్. ఈ సినిమా సమ్మర్‌లో విడుదల కానుంది. 'సవ్యసాచి' సినిమాతో తెలుగులో డైరెక్ట్ చిత్రం చేసిన మాధవన్ నెక్ట్స్ 'వస్తాడు నా రాజు' ఫేమ్ హేమంత్ మధుకర్ దర్శకత్వంలో మరో తెలుగు సినిమాలో హీరోగా నటించనున్నారు. అనుష్క, అంజలి, షాలినీ పాండే ప్రధానపాత్రల్లో కనిపిస్తారు. మార్చిలో ఈ సినిమా షూటింగ్ స్టార్ట్ కానుంది.

సరిహద్దు సైనికుడు


● తనీష్

మనిషికి, మనిషికీ.. దేశాలకు, ప్రాంతాలకు మధ్య కొన్ని హద్దులు ఉంటాయి. ఎవరి పరిధిలో వాళ్లున్నంత వరకూ అవి సరిగానే ఉంటాయి. కానీ ఒక్కసారి ఆ సరిహద్దులు అతిక్రమిస్తే సంఘర్షణ మొదలవుతుంది. దేశాలు, ప్రాంతాల మధ్య ఈ సరిహద్దు సంఘర్షణలు తీవ్ర పరిణామాలకు దారి తీయొచ్చు.. ఒక్కోసారి అది జాతీయ సమస్యగానూ మారొచ్చు.. అలా మారకుండా చూసే శక్తి ఆర్మీ. సైనికుడు సరిహద్దుకే కాదు దేశానికి కూడా రక్షకుడు. ఇదే కాన్సెప్ట్‌తో తనీష్ హీరోగా ఓ సినిమా రూపొందుతోంది. తనీష్ గత సినిమా రంగుతో విమర్శకుల ప్రశంసలు కూడా అందుకున్న కార్తికేయ ఈ చిత్రానికి దర్శకుడు. నేషనలైజ్డ్ కాన్సెప్ట్‌తో రూపొందుతోన్న ఈ చిత్రం టైటిల్ కూడా 'సరిహద్దు'. తెలుగుతోపాటు హిందీ భాషలోనూ విడుదల చేయబోతోన్న 'సరిహద్దు' మూవీ షూటింగ్ మార్చి 16 నుంచి ప్రారంభం కాబోతోంది. టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌లో ఉండబోతోన్న ఈ చిత్రంలో తెలుగుతో పాటు హిందీ భాషా నటులు కూడా నటిస్తారు. సినిమాకు సంబంధించిన మిగతా ఆర్టిస్టులు, టెక్నీషియన్స్ వివరాలను త్వరలోనే ప్రకటిస్తారు.

ఫిబ్రవరి 22న 'మిఠాయి'

రెడ్ యాంట్స్ పతాకంపై కమల్ కమరాజు, రవివర్మ, రాహుల్ రామకృష్ణ,. ప్రియదర్శి తదితరులు మెయిన్ లీడ్ గా నటిస్తోన్న డార్క్ కామెడీ చిత్రం 'మిఠాయి'. ప్రశాంత్‌కుమార్ దర్శక నిర్మాణంలో సినిమా రూపొందుతోంది.



ఉద్యోగం చేయడం.. ఏ పని లేకుండా తిరగడం.. అందమైన అమ్మాయిలు.. కార్లు, సెల్‌ఫోన్స్ ఇలా ఇద్దరి బెస్ట్‌ఫ్రెండ్స్ జర్నీ గురించి చెప్పే సినిమానే 'మిఠాయి'. అర్జున్ రెడ్డి ఫేమ్ సందీప్ వంగా ఈ సినిమా రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేశారు. ఈ సందర్భంగా దర్శకడు ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ''ఫిబ్రవరి 22న సినిమా విడుదల అవుతుండటం చాలా హ్యాపీగా ఉంది. తెలుగు సినిమా ఇండస్ట్రీలోకి మిఠాయి సినిమాతో ఎంట్రీ ఇస్తున్నాను. సందీప్ వంగా మిఠాయి సినిమాలో కీలక పాత్ర పోషించాడు. తను లేకపోతే ఈ సినిమానే లేదు. ఈ సందర్భంగా తనకు థాంక్స్'' అన్నారు.

షాక్ ఇచ్చిన దర్శకనిర్మాతలు


● తాప్సీ

తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో పలు సినిమాలు చేస్తున్న తాప్సీకి గత ఏడాది బాగానే కలిసొచ్చినట్టుంది. మూడు హిట్ సినిమాలు చేయడమే కాకుండా పెర్‌ఫార్మర్‌గా మంచి పేరు కూడా తెచ్చుకుంది. తాజాగా 'పతి పత్నీ ఔర్ వో' అనే రీమేక్ చిత్రంలో నటించేందుకు ఒప్పుకుంది తాప్సీ. ఫిబ్రవరిలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కావాల్సి ఉండగా చివరి నిమిషంలో ఈ సినిమాలో తాప్సీ హీరోయిన్ కాదని చిత్ర యూనిట్ ఎనౌన్స్ చేయడంతో తాప్సీ షాక్ అయింది. ''ఈ సినిమా కోసం నా షెడ్యూల్ అంతా సెట్ చేసుకొని వాళ్లకు డేట్స్ ఇచ్చాను. ఇప్పుడు నేను సినిమాలో లేనని తెలిసి షాక్ అయ్యాను. దీని గురించి దర్శకనిర్మాతలు ఎలాంటి సమాధానం చెప్పడం లేదు. ముందుగా ఈ విషయం తెలిసి ఉంటే డేట్స్‌ని వేరే సినిమాకి ఎడ్జస్ట్ చేసుకునే దాన్ని. ఈ ఘటన నా కళ్ళు తెరిపించింది. ఇలాంటి విషయాల్లో ఇకముందు జాగ్రత్తగా ఉండాలన్న విషయం నాకు బోధపడింది'' అని వాపోతోంది తాప్సీ.



'కె.ఎస్ 100' ట్రైలర్ విడుదల

చంద్ర శేఖర్ మూవీస్ పతాకంపై సమీర్ ఖాన్, శైలజ, సునీత పాండే, ఆశి రాయ్, శ్రద్ధ, అక్షత ప్రధాన పాత్రదారులుగా కె. వెంకట్ రామ్ రెడ్డి నిర్మించిన చిత్రం 'కె ఎస్ 100'. షేర్ దర్శకత్వం వహించిన ఈ చిత్ర ట్రైలర్ నిర్మాత సాయి వెంకట్, మల్టీ డీమెన్షన్ వాసు, అట్లూరి రామక ష్ణ లచే విడుదలైంది. ఈ సందర్భంగా నిర్మాత వెంకట రామ్ రెడ్డి మాట్లాడుతూ''మంచి హర్రర్ థ్రిల్లర్ రొమాంటిక్ మూవీ. సినిమా చాలా బాగొచ్చింది. అందరికీ నచ్చి తీరుతుందని ఆశిస్తున్నా'' అన్నారు. దర్శకుడు షేర్ మాట్లాడుతూ ''మొదట ఒక లైన్ చెప్పగానే నిర్మాత వెంకట్ రెడ్డి గారికి బాగా నచ్చి సినిమా చేద్దామని చెప్పారు. హీరో సమీర్ ఖాన్ యాక్టింగ్ మెచూర్డ్‌గా ఉంటుంది. నలుగురు హీరోయిన్స్ నటిస్తున్నారు. ఈ తరం అమ్మాయిలు ఏవిధంగా ఫాస్ట్ కల్చర్‌ను అలవర్చుకున్నారు అనే విధంగా తెరకెక్కించాం. డిఫరెంట్ స్టోరి. మంచి మెసేజ్ ఓరియెంటెడ్ మూవీ'' అన్నారు. కార్యక్రమంలో లయన్ సాయి వెంకట్ సహా చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

టాలీవుడ్‌లోకి మరో మలయాళీ భామ


● అనగా మారుథోరా


టాలీవుడ్‌లోకి కొత్త హీరోయిన్ ఎంట్రీ ఇవ్వనుంది. వివరాల్లోకెళ్తే.. 'ఆర్.ఎక్స్ 100'తో హిట్ కొట్టిన హీరో కార్తికేయ ఇప్పుడు వరుస సినిమాలతో బిజి బిజీగా ఉన్నారు. అనిల్ కడియాల, తిరుమల్ రెడ్డి నిర్మాతలుగా అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో కొత్త చిత్రం ఒంగోలులో ప్రారంభమైంది. ఈ సినిమాలో అనగా మరుథోరా అనే మలయాళీ అమ్మడుని హీరోయిన్‌గా ఎంపిక చేసుకున్నారు. ఈమె 'నప్పే తునై' అనే తమిళ సినిమాలో నటించింది. తెలుగులో ఇది ఆమె మొదటి చిత్రం. దర్శకుడు కార్తికేయ పక్కన కొత్త హీరోయిన్ అయితే బావుంటుందని భావించి వెతుకున్న క్రమంలో అనగా మరుథోరా నటించిన తమిళ సినిమా చూడటం.. ఆమె నటన ఆకట్టుకోవడంతో ఆమెను హీరోయిన్‌గా ఎంపిక చేశారట.

బీజేపీకి మృత్యుగంటలే




- మమత ర్యాలీకి రాహుల్ మద్దతు
- నేడు కోల్‌కతాలో ప్రతిపక్ష ర్యాలీ
- 20 పార్టీలు పాల్గొనే అవకాశం
- ఎన్నికల్లో బీజేపీకి 125 లోపే
- ప్రాంతీయ పార్టీలదే ఇక హవా..
- నిర్ణయించేది ప్రాంతీయ పార్టీలే
- బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

న్యూఢిల్లీ, జనవరి 18: ప్రతిపక్షాల ఐక్యతను చాటేలా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కోల్‌కతాలో శనివారం తలపెట్టిన ర్యాలీ బీజేపీకి మృత్యుగంటలు మోగిస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. ర్యాలీకి ఆయన తన పూర్తి మద్దతు ప్రకటించారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించతలపెట్టిన ఈ ర్యాలీ ద్వారా ఇతర పార్టీలన్నింటినీ కలుపుకెళ్లే నాయకురాలిగా మమతా బెనర్జీని నిలబెడుతుందని టీఎంసీ వర్గాలు భావిస్తున్నాయి. దాదాపు 20 వరకు ప్రతిపక్ష పార్టీలు ఈ ర్యాలీకి హాజరవుతాయని అనుకుంటున్నారు. ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, లౌకిక వాద స్తంభాలను రక్షించుకోవడం ద్వారా మాత్రమే అసలైన జాతీయ వాదనం, అభివృద్ధి సాధ్యం అవుతాయని భావిస్తూ.. మొత్తం ప్రతిపక్షమంతా ఏకమవుతోందని రాహుల్ గాంధీ తన లేఖలో అన్నారు. బీజేపీ, మోదీల ఆలోచనలు మాత్రం ఈ స్తంభాలను పడగొట్టేలా ఉన్నాయని మండిపడ్డారు. తమది బీజేపీ దుష్పరిపాలనకు వ్యతిరేకంగా సాగే 'సమైక్య భారత ర్యాలీ' అవుతుందని మమతా బెనర్జీ అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ 125 స్థానాల కంటే ఎక్కువ సాధించలేదని, ప్రాంతీయ పార్టీలన్నీ కలిపి సాధించే సీట్ల సంఖ్య బీజేపీ బలం కంటే చాలా ఎక్కువ ఉంటుందని ఆమె చెప్పారు. ఎన్నికల తర్వాత ఏం జరగాలన్నది ప్రాంతీయ పార్టీలే నిర్ణయిస్తాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు.. కర్ణాటక సీఎం కుమారస్వామి, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ ప్రధాని దేవెగౌడ, మాజీ సీఎంలు ఫరూక్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, అఖిలేశ్ యాదవ్ ఈ ర్యాలీలో పాల్గొనే అవకాశాలున్నాయి.



అక్కడెందుకు.. వచ్చెయ్యండి

- ఆర్జేడీలో సీనియర్లకు గౌరవం లేదు
- అలా గౌరవించేది ఎన్డీయే మాత్రమే
- రఘువంశ సింగ్‌కు సుశీల్ మోదీ ఆఫర్

పట్నా, జనవరి 18: అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్ కల్పించే బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయడం ద్వారా తమ పార్టీ తప్పు చేసిందని చెప్పడంతో ఆర్జేడీ జాతీయ ఉపాధ్యక్షుడు రఘువంశ ప్రసాద్ సింగ్ సొంత పార్టీ నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొన్నారు. ఆయనను తమ పార్టీలో చేరాలంటూ బీజేపీ నుంచి స్వాగత వచనాలు మొదలయ్యాయి. ఆయన స్థాయి నాయకులకు ఆర్జేడీలో ఎలాంటి గౌరవం లేదని.. కేవలం ఎన్డీయే మాత్రమే ఆయనను తగిన విధంగా గౌరవిస్తుందని బిహార్ ఉప ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోదీ అన్నారు. కోటా బిల్లును వ్యతిరేకించిన తర్వాత నష్ట నివారణ చర్యల్లో భాగంగా రఘువంశ ప్రసాద్ సింగ్ కాస్త భిన్నంగా మాట్లాడారు. అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్ కల్పించడానికి ఆర్జేడీ వ్యతిరేకం కాదని పార్టీ అధినేత లాలుప్రసాద్ తనకు చెప్పారన్నారు. తమ పార్టీ ఎప్పుడూ పేదల కోసమే కృషి చేసిందని, ఓబీసీ, ఈబీసీ, దళితులకు వారి జనాభా ఆధారంగా రిజర్వేషన్లు పెంచాలన్నదే తమ ఉద్దేశమని.. కోటా బిల్లుకు మద్దతు ఇవ్వకపోవడం తమ తప్పేనని ఆయన అన్నారు. రఘువంశ ప్రసాద్ సింగ్ లాంటి అగ్రవర్ణ నేతలు ఎన్నికల్లో అగ్రవర్ణ ఓటర్లను ఎలా ఎదుర్కొంటారని కేంద్ర మంత్రి, ఎల్జేపీ అధ్యక్షుడు రాం విలాస్ పాశ్వాన్ ప్రశ్నించారు. అయితే ఇప్పుడు సుశీల్ మోదీ ఆహ్వానం పలకడంతో ఆర్జేడీలో ఎలాంటి ముసలం పుడుతుందోనని అంతా ఆందోళన చెందుతున్నారు. వైశాలి లోక్‌సభ స్థానంలో రఘువంశ ప్రసాద్ సింగ్ గట్టి అభ్యర్థి. దాంతో ఆయనను తమవైపు లాక్కోడానికి బీజేపీ ప్రయత్నాలు మొదలుపెట్టింది.

కోటా బిల్లుకు డీఎంకే చెక్

- మద్రాస్ హైకోర్టులో రిట్ పిటిషన్
- రాజ్యాంగ సవరణ తగదని వాదన

చెన్నై, జనవరి 18: అగ్రవర్ణ పేదలకు విద్య, ఉద్యోగాలలో 10% రిజర్వేషన్ కల్పిస్తూ చేసిన రాజ్యాంగ సవరణను తమిళనాడులోని డీఎంకే మద్రాస్ హైకోర్టులో సవాలు చేసింది. ఈ మేరకు శుక్రవారం ఒక రిట్ పిటిషన్ దాఖలుచేసింది. డీఎంకే కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్ఎస్ భారతి ఈ పిటిషన్ దాఖలు చేశారు. పార్లమెంటులో ఈ బిల్లుకు వ్యతిరేకంగా డీఎంకే ఓటు వేసింది. బిల్లును తదుపరి పరిశీలన కోసం సెలెక్ట్ కమిటీకి పంపాలని ఆ పార్టీ నాయకురాలు, ఎంపీ కనిమొళి డిమాండ్ చేశారు. బిల్లుపై చర్చ ప్రారంభం కావడానికి ముందే, తమ పార్టీ దీన్ని వ్యతిరేకిస్తుందని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ ప్రకటించారు. రిజర్వేషన్లు అనేవి సామాజిక వెనుకబాటును బట్టి ఉండాలి తప్ప ఆర్థిక హోదాను బట్టి కాదని ఆయన అన్నారు. అగ్రవర్ణాలలో కూడా ఉన్న పేదలకు రిజర్వేషన్లు కల్పించడం వల్ల సామాజిక సమతుల్యత వస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టే సమయంలో చెప్పారు. ఇటీవలే ముగిసిన శీతాకాల సమావేశాలలో ఈ బిల్లును ఆమోదించిన విషయం తెలిసిందే. బీజేపీకి చాలా అంశాలలో మద్దతు పలుకుతున్న అన్నాడీఎంకే కూడా ఈ బిల్లును మాత్రం ప్రశ్నించింది. పేదల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి, ముద్ర పథకం, స్కాలర్‌షిప్పుల లాంటివి చాలా చేపడుతోందని, ఇప్పుడు మళ్లీ అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించాలనుకుంటోందంటే ఆ పథకాలేవీ సరిగా అమలు కావట్లేదని అనుకోవాల్సి ఉంటుందని పార్టీ నాయకుడు ఎం. తంబిదురై వ్యాఖ్యానించారు.

బ్రిటన్ ప్రిన్స్ ఫిలిప్‌కు ప్రమాదం

లండన్, జనవరి 18: బ్రిటన్ రాణి ఎలిజబెత్ 2 భర్త ప్రిన్స్ ఫిలిప్ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. రాజకుటుంబానికి చెందిన శాండ్రింగ్‌హామ్ ఎస్టేట్ సమీపంలో ఫిలిప్ కారును మరో కారు ఢీకొట్టడంతో ఈ ఘటన జరిగింది. అయితే అదృష్టవశాత్తు ఈ ప్రమాదంతో ఆయనకు ఎలాంటి హానీ జరగలేదు. 97ఏళ్ల ప్రిన్స్ ఫిలిప్ శాండ్రింగ్‌హామ్ ఎస్టేట్ నుంచి స్వయంగా కారు నడుపుకొంటూ మెయిన్ రోడ్డుపైకి చేరుకోగానే అటుగా వేగంగా వస్తున్న మరో కారు ఆయనను ఢీకొట్టింది. దీంతో ఫిలిప్ కారు ఒక్కసారిగా బోల్తా పడి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది.

24 గంటలూ భద్రత



- ఆ ఇద్దరు మహిళలకు కల్పించండి
- కేరళ పోలీసులకు సుప్రీం ఆదేశం
- మహిళల రక్షణ బాధ్యత సర్కారుదే
- ఆలయంలోకి 51 మంది మహిళలు
- పోలీసుల రక్షణతో స్వామి దర్శనం
- కనకదుర్గను తీవ్రంగా కొట్టిన అత్త
- తలకు గాయాలు.. ఆస్పత్రిలో చికిత్స
- రక్షణ కోసం సుప్రీంకోర్టులో కేసు..

న్యూఢిల్లీ, జనవరి 18: శబరిమలలోని అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించిన ఇద్దరు మహిళలకు రోజుకు 24 గంటలూ భద్రత కల్పించాలని కేరళ పోలీసులను సుప్రీంకోర్టు ఆదేశించింది. వారి రక్షణ కోసం దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ ఆదేశాలు జారీచేసింది. వారి భద్రతకు సంబంధించిన మొత్తం బాధ్యతను కేరళ ప్రభుత్వం తీసుకోవాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎల్.ఎన్.రావు, జస్టిస్ దినేశ్ మహేశ్వరిలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. కనకదుర్గ (39), బిందు అమ్మిని (40) ఈనెల రెండో తేదీన అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించి స్వామి దర్శనం చేసుకున్నారు. దాంతో 10-50 సంవత్సరాల మధ్య వయసులో ఉండి, అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించిన మహిళలుగా వీరు చరిత్ర సృష్టించారు. అప్పటినుంచి వారిద్దరికీ తీవ్రంగా బెదిరింపులు వస్తున్నాయి. రెండు వారాల పాటు ఎవరికీ కనపడకుండా రహస్య ప్రాంతంలో ఉండి.. అనంతరం ఇంటికి తిరిగి వెళ్లిన తర్వాత కనకదుర్గను ఆమె అత్తగారు తీవ్రంగా కొట్టినట్లు చెబుతున్నారు. తలకు గాయాలు కావడంతో ఆమెను ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ఆ ఇద్దరు మహిళల ప్రాణాలకు, స్వేచ్ఛకు ప్రమాదం ఉందని, వారిలో ఒకరిపై దాడి జరిగి ఆసుపత్రిలో కూడా ఉన్నారని, అందువల్ల తమకు 24 గంటలూ భద్రత కావాలని వారు కోరుకుంటున్నారని మహిళల తరఫున వాదించిన సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ కోర్టును కోరారు. వారి చిరునామాలు ఎక్కడ అన్న విషయం కూడా బయట పెట్టవద్దని విజ్ఞప్తి చేశారు. ఇద్దరు మహిళలు అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించిన విషయం తెలిసి కేరళలో రాష్ట్ర వ్యాప్తంగా తీవ్రస్థాయిలో నిరసన ప్రదర్శనలు మొదలయ్యాయి. హిందూ సంస్థల సభ్యులు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మద్దతుతో ఒక రోజంతా సమ్మె చేశారు. ఇప్పటివరకు 51 మంది మహిళలు అయ్యప్పను దర్శించుకున్నారని కోర్టుకు కేరళ ప్రభుత్వం చెప్పింది. వయసుతో సంబంధం లేకుండా మహిళలు ఎవరైనా కూడా అయ్యప్పను దర్శించుకోవాలని సుప్రీంకోర్టు గత సంవత్సరం సెప్టెంబరు 28వ తేదీన తీర్పు చెప్పినప్పటి నుంచి ఆలయ పరిసరాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కోర్టు ఉత్తర్వులను అయ్యప్ప భక్తులు, నిరసనకారులు ఏమాత్రం అంగీకరించలేదు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆ వయసులో ఉండే మహిళలు ఆలయంలోకి ప్రవేశించకూడదని వారు వాదిస్తున్నారు. కొంతమంది మహిళలు ఆలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించినా, భక్తులు వివిధ ప్రాంతాలలో వారిని అడ్డుకున్నారు. అయితే పోలీసుల రక్షణతో అర్ధరాత్రి సమయంలో ఇద్దరు మహిళలు మాత్రం 18 మెట్లు ఎక్కి అయ్యప్పను దర్శించుకున్నామని చెప్పారు.

అయ్యప్పను దర్శించుకున్న 51 మంది మహిళలు


- వారంతా 50 ఏళ్ల వయస్సుకు లోబడిన వారే..
- సుప్రీంకోర్టుకు వివరించిన కేరళ సర్కారు

న్యూఢిల్లీ, జనవరి 18: సుప్రీంకోర్టు తీర్పు తర్వాత ఇప్పటి వరకు శబరిమల ఆలయంలోకి 51 మంది మహిళలు ప్రవేశించినట్లు కేరళ ప్రభుత్వం వెల్లడించింది. వారందరూ 50 ఏళ్ల వయసులోపు వారేనని పేర్కొంది. ఈ జాబితాను ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానానికి అందజేసింది. అయ్యప్ప ఆలయంలోకి అడుగుపెట్టిన తొలి ఇద్దరు మహిళలు తమకు భద్రత కల్పించాలని న్యాయస్థానాన్ని కోరుతూ పిటిషన్ వేసిన నేపథ్యంలో కేరళ ప్రభుత్వం ఇప్పటివరకు ఆలయంలోకి ప్రవేశించిన మహిళల జాబితాను సర్వోన్నత న్యాయస్థానానికి అందజేసింది. ''దాదాపు 16 లక్షల మంది భక్తులు ఆలయ ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ఏడు వేల మంది మహిళలున్నారు. వారంతా పది నుంచి 50 ఏళ్ల వయసులోపు వారే. 16 లక్షల మందిలో 8.2 లక్షల మంది స్వామిని దర్శించుకున్నారు. ఇక ఏడు వేల మందిలో ఆలయంలోకి ప్రవేశించింది కేవలం 51 మందే. వీరు ప్రవేశిస్తున్నప్పుడు ఎలాంటి అవాంతరాలు తలెత్తలేదు. వారు సన్నిధానం నుంచి బయటికి వచ్చాక టికెట్లకు పక్కాగా స్కాన్ చేసి పంపించాం. మొత్తానికి 2018లో ఇప్పటివరకు అయ్యప్పను దర్శించుకున్నవారి సంఖ్య 44 లక్షలు' అని ప్రకాశ్ అనే ప్రభుత్వాధికారి వెల్లడించారు.



2025 తర్వాతే రామమందిరం

- 2024 లోక్‌సభ ఎన్నికల అనంతరం తెరపైకి
- ఇప్పటికి మందిరం అంశం అటకెక్కినట్లే
- ఆర్ఎస్ఎస్ డిప్యూటీ చీఫ్ భయ్యాజీ జోషి



న్యూఢిల్లీ, జనవరి 18: అయోధ్యలో రామమందిరం విషయంలో ఆర్ఎస్ఎస్ డిప్యూటీగా పరిగణిస్తున్న భయ్యాజీ జోషి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికైతే అయోధ్య అంశం అటకెక్కినట్లేనని వ్యాఖ్యానించారు. 2024లో లోక్‌సభ ఎన్నికల ముగిసిన అనంతరం ఈ అంశం తెరపైకి వచ్చే అవకాశం ఉందని అన్నారు. యుద్ధమే లేదు.. కానీ.. సరిహద్దుల వెంట సైనికులు చనిపోతున్నారని, ధరలు భారీగా పెరిగిపోయాయని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్యానించిన రెండు రోజుల అనంతరం .. డిప్యూటీ చీఫ్ అయిన భయ్యాజీ జోషి ఇలా వ్యాఖ్యానించడం రాజకీయంగా చర్చనీయాశంమైంది. ''1952లో సోమ్‌నాథ్ మందిరాన్ని తిరిగి పునర్‌నిర్మించిన అనంతరం భారత్ శరవేగంగా అభివృద్ధి సాధించడం ప్రారంభించింది. 2025లో రామమందిరం నిర్మాణం పూర్తయిన తర్వాత మళ్లీ అదే జోరుగా అభివృద్ధి సాగుతుంది. రామమందిరం నిర్మాణం తర్వాత భారతదేశానికి 150 ఏళ్ల పాటు ఆశీస్సులు ఉంటాయి'' అని ఢిల్లీలో వీహెచ్‌పీ నిర్వహించిన ఓ కార్యక్రమంలో భయ్యాజీ జోషి పేర్కొన్నారు. రామమందిరం నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తేవాల్సిందేనని ఆయన మరోసారి ఉద్ఘాటించారు. ''మేం ఏ మతంతోనూ ఘర్షణ పడట్లేదు. మేం భిక్షమెత్తుకోవడం లేదు. మా మనోభావాలను మాత్రమే మేం వెల్లడిస్తున్నాం. చట్టం తేవడమే రామమందిరం నిర్మాణానికి ఒక్కే ఒక్క పరిష్కారం. ఆ హామీని నిరవేర్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వం గట్టిగా కృషి చేయాలి'' అని భయ్యాజీ జోషి పేర్కొన్నారు. కాగా, ఈ ఏడాది ప్రారంభంలో ఓ న్యూస్ ఏజెన్సీతో మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు తర్వాతే రామమందిరం నిర్మాణంపై తదుపరి చర్యలు తీసుకుంటామని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భయ్యాజీ జోషి చేసిన వ్యాఖ్యలు అటు ఆర్ఎస్ఎస్‌లోనూ.. ఇటు బీజేపీలోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. కాగా, నాగ్‌పూర్‌లో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ మాట్లాడుతూ... ''దేశంలో యుద్ధ వాతావరణం లేకపోయినా సరిహద్దుల వెంబడి సైనికులు ప్రాణాలు కోల్పోతున్నారు. అకారణంగా సైనికులు అమరులవుతున్న ప్రస్తుత పరిస్థితి మారాల్సి ఉంది. ఎంతో మంది ప్రాణాలు అర్పించి స్వాతంత్ర్యం సాధించుకున్న పరిస్థితి పూర్వం ఉంటే, తర్వాతి కాలంలో యుద్ధ సమయాల్లో మాత్రమే మన సైనికులు ప్రాణాలు కోల్పోయేవారిమి. ప్రస్తుతం యుద్ధ పరిస్థితులు లేనప్పటికీ, అన్యాయంగా శత్రువుల చేతిలో సైనికులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇది కేవలం మన కర్తవ్య నిర్వహణలో లోపం'' అని భగవత్ వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ప్రజల వైపు నుంచి కూడా తగిన తోడ్పాటు ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. మనం దేశాన్ని అత్యున్నత స్థానంలో నిలబెట్టాలంటే.. కొన్ని త్యాగాలకు పూనుకోవాల్సి ఉంటుందని చెప్పారు. దేశభద్రత కేవలం సైనిక బలగాలకు సంబంధించిన వ్యవహారం కాదని అన్నారు. ఇతరులకు బాధ్యతలు అప్పగించినట్లుగా ఈ అంశం ప్రభుత్వం చూసుకుంటుందని, ఆర్మీ చూసుకుంటుందని, పోలీసులు చూసుకుంటారని భావించొద్దనీ సమాజంలో ప్రతి ఒక్కరూ ఇందుకోసం కృషి చేయాలని సూచించారు. స్వాతంత్ర్యం సిద్ధించి 70ఏళ్లు గడుస్తున్నా..ఇతర దేశాలతో పోలిస్తే అభివృద్ధి, పురోగతిలో వెనుకబడి ఉన్నామన్న భగవత్ ఈ సందర్భంగా ఇజ్రాయెల్‌ను ఉదహరించారు. 19వ శతాబ్దంలో విభిన్న ప్రాంతాలకు వలస వెళ్లిన ఆ దేశస్థులు తిరిగి దేశంలోకి వచ్చి వర్తక, వ్యాపారాలు చేస్తూ 1948లో స్వాతంత్ర్యం సాధించుకుని ఇప్పుడు ప్రపంచంలోనే ప్రత్యేకస్థానం సంపాదించారని అన్నారు. వీరిద్దరి వ్యాఖ్యలు ఒకరకంగా ప్రధాని నరేంద్రమోదీని ఇబ్బంది పెట్టేవేనని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

కేంద్రంలో సుస్థిరత ఇక కల్లే..కేంద్ర మంత్రి




ముంబై, జనవరి 18: లోక్‌సభ ఎన్నికల తరువాత సుస్థిర ప్రభుత్వం ఏర్పాటు సందేహాస్పదమేనంటూ కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి జయంత్ సిన్హా సంచలన వ్యాఖ్యలు చేశారు. 2019 ఎన్నికల్లో కేంద్రంలోకి బలమైన ప్రభుత్వం వచ్చే అవకాశాలు లేవని ఆయన జోస్యం చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలకు విడమరచి చెప్పాలన్నారు. సమర్థవంతమైన ప్రభుత్వం రాని పక్షంలో దేశ భవిష్యత్‌కు ఇది మంచి పరిణామం కాదని, ప్రమాదమని ఆయన చెప్పుకొచ్చారు. దశాబ్దానికి పైగా బీజేపీ పాలిత రాష్ట్రాలుగా ఉన్న మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో బీజేపీ పట్టుకోల్పోయిన నేపథ్యంలో జయంత్ సిన్హా ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.



సుప్రీం జడ్జిలుగా దినేష్, ఖన్నా ప్రమాణం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ దినేష్ మాహేశ్వరి, జస్టిస్ సంజీవ్ ఖన్నాలు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్ ఆధ్వర్యంలో కోర్టు నంబరు 1లో వారు ప్రమాణ స్వీకారం చేశారు. ఖన్నా, దినేష్‌లతో కలిసి సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్య 28కి చేరింది. సుప్రీంలో మొత్తం 31 మంది జడ్జిలు ఉండొచ్చు. జస్టిస్ సంజీవ్ ఖన్నా ఢిల్లీ హైకోర్టు జడ్జిగా పనిచేయగా, జస్టిస్ దినేష్ మాహేశ్వరి కర్ణాటక హైకోర్టు జడ్జిగా పనిచేశారు. జస్టిస్ సంజీవ్ ఖన్నాను కేంద్రం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించడంపై అభ్యంతరాలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల మేరకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నప్పటికీ.. ఆయన విషయంలో సీనియార్టీనీ పాటించలేదంటూ సుప్రీంకోర్టు న్యాయమూర్తితో పాటు మాజీ న్యాయమూర్తులు, బార్ కౌన్సిల్ నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రదీప్ నంద్రజోగ్, ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాజేంద్ర మేనన్‌లు సీనియర్లు అయినప్పటికీ, వారిని కాదని జస్టిస్ ఖన్నాను నియమించారంటూ అసంతృప్తి వ్యక్తమైంది.

ఆర్డినెన్సు తెస్తాం



- ముంబైలో డాన్స్‌బార్లను ఆపుతాం
- తీర్పుపై న్యాయనిపుణులతో చర్చ
- తర్వాత అవసరమైతే ఆర్డినెన్సు..
- మహారాష్ట్ర మంత్రి ముంగంటివార్

ముంబై, జనవరి 18: రాష్ట్రంలో డాన్స్ బార్లను నియంత్రించేందుకు తగిన నిబంధనలు అమలుచేయడానికి వీలుగా అవసరమైతే తాము ఆర్డినెన్సు తెస్తామని మహారాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. డాన్స్ బార్ల లైసెన్సుల విధానంపై మహారాష్ట్ర ప్రభుత్వం విధించిన కఠినతరమైన నిబంధనల నుంచి ఊరట కల్పిస్తూ సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన మర్నాడే ప్రభుత్వం నుంచి ఈ తరహా స్పందన రావడం గమనార్హం. సుప్రీంకోర్టు తీర్పు కాపీని విశ్లేషించి, దానిపై న్యాయ నిపుణులతో చర్చించిన తర్వాత అవసరమైతే ముంబైలో డాన్స్ బార్లను ఆపేందుకు ఆర్డినెన్సు జారీ చేస్తామని రాష్ట్ర ఆర్థిక మంత్రి సుధీర్ ముంగంటివార్ చెప్పారు. డాన్స్ బార్లు దాదాపుగా పనిచేయకుండా అత్యంత కఠినమైన నిబంధనలను ఇంతకుముందు విధించడంతో వాటిని సవాలు చేస్తూ రెస్టారెంట్లు, డాన్స్‌బార్ల యజమానులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దాంతో వాటిని పూర్తిగా నిషేధించడం సరికాదని, అవసరమైతే కొన్ని నియంత్రణలు మాత్రం విధించవచ్చని తన తుది తీర్పులో పేర్కొంది. 2016 నాటి మహారాష్ట్ర చట్టాన్ని సవాలు చేస్తూ హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులు దాఖలుచేసిన పిటిషన్‌పై విచారించిన సుప్రీంకోర్టు.. గత సంవత్సరం ఆగస్టులో విచారణ ముగించి, తీర్పును వాయిదా వేసింది. ఆ తీర్పును గురువారం వెలువరించింది. ముంబై లాంటి నగరాల్లో పాఠశాలలకు, ఆధ్యాత్మిక ప్రదేశాలకు ఒక కిలోమీటరు దూరంలోనే డాన్స్‌బార్లు ఉండాలన్న నిబంధన అర్థరహితమని కోర్టు చెప్పింది. డాన్స్ బార్లలో డాన్సర్లకు కస్టమర్లు కావాలంటే టిప్‌లు ఇవ్వచ్చు గానీ, వాళ్ల మీద నోట్ల వర్షం మాత్రం కురిపించకూడదని స్పష్టం చేసింది. రాష్ట్రంలో ఉన్న మొత్తం డాన్స్ బార్లన్నీ సాయంత్రం 6.30 నుంచి 11.30 వరకు మాత్రమే నడవాలని తెలిపింది. అయితే డాన్స్ బార్లలో తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలు ఉండాలన్న నిబంధనను కోర్టు కొట్టేసింది. అది వ్యక్తిగత స్వేచ్ఛకు భంగమని తెలిపింది. డాన్స్‌బార్ల యజమానులకు సత్ప్రవర్తన ఉండాలని, ఎలాంటి నేర చరిత్ర ఉండకూడదని ఉన్న నిబంధనను కూడా కోర్టు కొట్టేసింది. సత్ప్రవర్తనకు, నేరచరిత్రకు ఇంత లోపు అయితే మంచిదన్న కచ్చితమైన నిర్వచనం ఏమీ లేదని కోర్టు చెప్పింది. 2005 నుంచి ఇప్పటివరకు డాన్స్‌బార్లకు ఏ ఒక్కరికీ లైసెన్సులు ఇవ్వలేదని, ఇలా చేయడం కుదదరని జస్టిస్ ఏకే సిక్రీ, జస్టిస్ అశోక్ భూషణ్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది. 2016లో డాన్స్ బార్ నియంత్రణ బిల్లును రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. అందులో డాన్సులు జరిగేచోట మద్యం ఇవ్వకూడదని, తప్పనిసరిగా రాత్రి 11.30లోపు మూసేయాలని నిబంధనలు విధించారు. దాంతోపాటు, నిబంధనలను పాటించని డాన్స్ బార్ యజమానులు, కస్టమర్లకు భారీ జరిమానాలు కూడా విధించారు. దాంతో వాటిని సవాలుచేస్తూ డాన్స్‌బార్, రెస్టారెంట్ల యజమానులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

SPORTS హైదరాబాద్
మనం 8
స్పోర్ట్స్
శనివారం 19 జనవరి 2019

మెన్ ఇన్ బ్లూ మరో చరిత్ర సృష్టించారు. టెస్టు సిరీస్ గెలిచిన కోహ్లీ సేన తొలిసారి ఆస్ట్రేలియా గడ్డపై వన్డే సిరీస్‌ను కైవసం చేసుకుంది. వరల్డ్ కప్‌కు తొలి ప్రాక్టీస్‌గా భావించిన ఆస్ట్రేలియా పర్యటనలో టీమిండియా ఆద్యంతం అద్భుత ప్రతిభ కనబరిచింది. కెప్టెన్ విరాట్ కోహ్లీ మొదలుకొని చాహల్ వరకు అందరూ తమ తమ స్థాయిలో సత్తా చాటారు. ముఖ్యంగా మొన్నటి వరకు తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న మాజీ కెప్టెన్, వికెట్ కీపర్ మహేంద్ర సింగ్ ధోనీ చివరి రెండు మ్యాచ్‌ల్లో ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు

మరో చరిత్ర

తొలిసారి ద్వైపాక్షిక వన్డే సిరీస్ గెలిచిన మెన్ ఇన్ బ్లూ

ఆస్ట్రేలియా పర్యటనలో టీమిండియా

టీ20 సిరీస్: 1-1 డ్రా
టెస్టు సిరీస్: 2-1తో గెలుపు
వన్డే సిరీస్: 2-1తో కైవసం

ఆస్ట్రేలియాలో ఉత్తమ వన్డే బౌలింగ్ ఫిగర్స్

అజిత్ అగార్కర్: 6/42 ఆస్ట్రేలియాపై 2004 మెల్‌బోర్న్
యజ్వేంద్ర చాహల్: 6/42 ఆస్ట్రేలియాపై 2019 మెల్‌బోర్న్
మిచెల్ స్టార్క్: 6/43 ఇండియాపై 2015 మెల్‌బోర్న్
క్రిస్ వోక్స్: 6/45 ఆస్ట్రేలియాపై 2011 బ్రిస్బేన్



మెల్‌బోర్న్: సుదీర్ఘ ఆస్ట్రేలియా పర్యటనను టీమిండియా గెలుపుతో ముగించింది. శుక్రవారమిక్కడ జరిగిన చివరి, మూడో వన్డేలో టీమిండియా 53000 మంది అభిమానులు సాక్షిగా మరో నాలుగు బంతులు మిగిలి ఉండగానే 7 వికెట్లతో ఆస్ట్రేలియాను ఓడించింది. దీంతో మూడు మ్యాచ్‌ల ఈ ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను 2-1తో టీమిండియా కైవసం చేసుకుంది. టాస్ గెలిచిన కోహ్లీ ఫీల్డింగ్ ఎంచుకోవడంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా జట్టు 48.4 ఓవర్లలో ఆలౌటైంది. తర్వాత టీమిండియా 49.2 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. ధోనీ మరోసారి చివరి వరకు క్రీజులో ఉండి జట్టుకు విజయాన్ని కట్టబెట్టాడు. ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌లో భారత బౌలర్ యజ్వేంద్ర చాహల్ 6 వికెట్లు తీసి కంగారూలను ఖంగు తినిపించాడు. ఈ మ్యాచ్‌లో చాహల్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఇక అటు నుంచి అటే కోహ్లీ సేన న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లనుంది.

గతంలో ఎన్నడూ టీమిండియా ఆస్ట్రేలియా గడ్డపై ద్వైపాక్షిక వన్డే సిరీస్ గెలవలేదు. ఇంతకుముందు అంటే 1985లో బెన్సన్ హెడ్జెస్ వరల్డ్ చాంపియన్‌షిప్, 2008లో కామన్వెల్త్ బ్యాంక్ సిరీస్‌లలో మాత్రమే టీమిండియా విజేతగా నిలిచింది. నిజానికి ఆస్ట్రేలియాలో టీమిండియాకు ఇది రెండో ద్వైపాక్షిక వన్డే సిరీస్. 2016 ద్వైపాక్షిక సిరీస్‌లో టీమిండియా 1-4తో ఓటమిపాలైంది. కానీ ఈసారి కోహ్లీ సేన దాన్ని సాధించింది. సిడ్నీలో జరిగిన తొలి వన్డేలో ఆస్ట్రేలియా 34 పరుగులతో గెలవడం.. తర్వాత అడిలైడ్‌లో జరిగిన రెండో వన్డేలో టీమిండియా 2-1తో ఆతిథ్య జట్టును ఓడించడంతో సిరీస్ 1-1తో సమమైంది. కానీ ఇప్పుడు క్రిక్కిరిసిన మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో టీమిండియా తన దైన శైలిలో మరో మ్యాచ్‌లో గెలిచి 2-1తో సిరీస్‌ను కైవసం చేసుకుంది.

యువ స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్ 6 వికెట్లు తీయడంతో తొలి బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియాను 230 పరుగులకే కట్టడి చేయగలిగారు. తర్వాత టీమిండియా ఇన్నింగ్స్‌లో మహేంద్ర సింగ్ ధోనీ 114 బంతుల్లో అజేయ 87 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ సిరీస్‌లో ధోనీకిది వరుసగా రెండో అర్ధ సెంచరీ. ధోనీ, కేదార్ జాదవ్ (57 బంతుల్లో 61 నాటౌట్) అర్ధ సెంచరీలు చేయడమే కాకుండా నాలుగో వికెట్‌కు అజేయ 121 పరుగుల కీలక, భారీ భాగస్వామ్యాన్ని అందించారు. 62 బంతుల్లో 46 పరుగులు చేసిన కోహ్లీ శిఖర్ ధావన్‌తో కలిసి 44 పరుగులు, ధోనీతో కలిసి 54 పరుగుల భాగస్వామ్యాలను నెలకొల్పాడు. తర్వాత జై రిచర్డ్సన్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. 0 పరుగుల వద్ద లైఫ్ పొందిన ధోనీ ఆరు సిక్సర్లతో మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. ధోనీ ఇచ్చిన ఈజీ క్యాచ్‌ను గ్లెన్ మాక్స్‌వెల్ చేజార్చడంతో ఆస్ట్రేలియా జట్టు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. ఈ మ్యాచ్‌లో స్టార్ ప్లేయర్‌గా నిలిచిన చాహల్‌కు ఈ సిరీస్‌లో ఇది తొలి మ్యాచ్. ఆస్ట్రేలియా గడ్డపై ఏ బౌలరూ సాధించని ఉత్తమ బౌలింగ్ ఫిగర్‌ను చాహల్ (6/46) సాధించి రికార్డుల్లోకెక్కాడు. అంతేకాకుండా 2004లో ఇదే మైదానంలో ఇదే బౌలింగ్ ఫిగర్స్‌ను సాధించిన అజిత్ అగార్కర్‌తో సమానంగా చాహల్ నిలిచాడు.



ఆస్ట్రేలియా జట్టులో పీటర్ హాండ్‌స్కంబ్ ఒక్కడే ప్రశంసనీయమైన బ్యాటింగ్ ఆడాడు. 63 బంతుల్లో 58 పరుగులు చేశాడు. ఇతను కూడా తన వికెట్‌ను చాహల్‌కు సమర్పించుకున్నాడు. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియన్లు పేలవంగా ఆడారు. 17 బౌండరీలు కొట్టి మరో ఎనిమిది బంతులుండగానే చాప చుట్టేశారు. ఆస్ట్రేలియా ఓపెనర్లు మరోసారి విఫలమయ్యారు. అలెక్స్ కేరీ మూడో ఓవర్లో అవుటయ్యాడు. భువనేశ్వర్ వేసిన బంతి అలెక్స్ బ్యాట్ అంచును తాకి రెండో స్లిప్స్‌లో ఉన్న కోహ్లీ చేతిలోకి వెళ్లింది. మరో ఆరు ఓవర్ల తర్వాత మరో ఓపెనర్, కెప్టెన్ ఆరోన్ ఫించ్ కూడా పెవిలియన్ దారి పట్టాడు. భువనేశ్వర్ బౌలింగ్‌లో ఎల్‌బిడబ్ల్యూగా వెనుదిరిగాడు. తర్వాత షాన్ మార్ష్, ఉస్మాన్ ఖవాజా ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. కానీ చాహల్ వేసిన వైడ్ బాల్‌ను ఆడబోయిన మార్ష్‌ను కీపర్ ధోనీ తెలివిగా స్టంపింగ్ చేశాడు. అడిలైడ్ మ్యాచ్‌లో మార్ష్ సెంచరీ చేసిన సంగతి తెలిసిందే. మరో మూడు బంతుల తర్వాత ఖవాజా కూడా అవుటయ్యాడు. చాహల్ బౌలింగ్‌లో ఖవాజా అతనికే క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. 20 బంతులు ఆడిన మార్కస్ స్టోనిస్ మూడో వికెట్‌గా చాహల్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. ఎక్రైక స్లిప్‌లో ఉన్న రోహిత్ శర్మకు క్యాచ్ ఇచ్చాడు. దీంతో ఆస్ట్రేలియా 30 ఓవర్లలో 123 పరుగులకు 5 వికెట్లు కోల్పోయింది. తర్వాత వచ్చిన గ్లెన్ మాక్స్‌వెల్ కాస్త దూకుడుగా ఆడాడు. 19 బంతుల్లో 26 పరుగులు చేసిన మాక్స్‌వెల్.. మహ్మద్ షమీ బౌలింగ్‌లో అవుటయ్యాడు. మ్యాక్స్‌వెల్ ఇచ్చిన క్యాచ్‌ను డీప్ థర్డ్ మెన్ స్థానంలో ఉన్న భువనేశ్వర్ పరుగెత్తుకుంటూ వచ్చి అద్భుతమైన డైవింగ్ క్యాచ్ పట్టాడు. జై రిచర్డ్సన్ కొద్ది సేపు స్పిన్ బౌలింగ్‌ను ధీటుగానే ఎదుర్కొన్నాడు. అయితే చాహల్ బౌలింగ్‌లో షార్ట్ మిడ్‌వికెట్ స్థానంలో ఉన్న కేదార్ జాదవ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. చాహల్‌కు ఇది నాలుగో వికెట్. 46వ ఓవర్లో చాహల్ బౌలింగ్‌లో హాండ్‌స్కంబ్ ఎల్‌బిడబ్ల్యూగా వెనుదిరిగాడు. ఆ తర్వాత ఆస్ట్రేలియా చాలా వేగంగా కుప్పకూలింది. చాహల్ బౌలింగ్‌లోనే ఆడమ్ జంపా లాంగ్ ఆన్‌లో ఉన్న విజయ్ శంకర్‌కు క్యాచ్ ఇచ్చాడు. తర్వాత బిల్లీ స్టాన్‌లేక్‌ను షమీ డకౌట్ చేశాడు.

స్కోరుబోర్డు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: అలెక్స్ కేరీ (సి) కోహ్లీ (బి) భువనేశ్వర్ 5, ఫించ్ ఎల్‌బిడబ్ల్యూ (బి) భువనేశ్వర్ 14, ఖవాజా (సి) అండ్ (బి) చాహల్ 34, మార్ష్ (స్టంప్డ్) ధోనీ (బి) చాహల్ 39, హాండ్‌స్కంబ్ ఎల్‌బిడబ్ల్యూ (బి) చాహల్ 58, స్టోనిస్ (సి) రోహిత్ (బి) చాహల్ 10, మాక్స్‌వెల్ (సి) భువనేశ్వర్ (బి) షమీ 26, రిచర్డ్సన్ (సి) జడేజా (బి) చాహల్ 16, జంపా (సి) శంకర్ (బి) చాహల్ 8, సిడ్డిల్ నాటౌట్ 10, స్టాన్‌లేక్ (బి) షమీ 0; ఎక్స్‌ట్రాలు: 10; **మొత్తం:** 48.4 ఓవర్లలో 230 ఆలౌట్; **వికెట్ల పతనం:** 1-8, 2-27, 3-100, 4-101, 5-123, 6-161, 7-206, 8-219, 9-228, 10-230; **బౌలింగ్:** భువనేశ్వర్: 8-1-28-2, షమీ: 9.4-0-47-2, శంకర్: 6-0-23-0, జాదవ్: 6-0-35-0, జడేజా: 9-0-53-0, చాహల్: 10-0-42-6.

ఇండియా ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) మార్ష్ (బి) సిడ్డిల్ 9, ధావన్ (సి) అండ్ (బి) స్టోనిస్ 23, కోహ్లీ (సి) కేరీ (బి) రిచర్డ్సన్ 46, ధోనీ నాటౌట్ 87, జాదవ్ నాటౌట్ 61; ఎక్స్‌ట్రాలు: 8; **మొత్తం:** 49.2 ఓవర్లలో 234/3; **వికెట్ల పతనం:** 1-15, 2-59, 3-113; **బౌలింగ్:** రిచర్డ్సన్: 10-1-27-1, సిడ్డిల్: 9-1-56-1, స్టాన్‌లేక్: 10-0-49-0, మాక్స్‌వెల్: 1-0-7-0, జంపా: 10-0-34-0, స్టోనిస్: 9.2-0-60-1.



చాహల్ 'ఆరే'శాడు

యజ్వేంద్ర చాహల్ శుక్రవారం తన స్పిన్ మాయా జాలంతో ఆస్ట్రేలియాను కోలుకోలేని దెబ్బ తీశాడు. మెల్‌బోర్న్ జరిగిన చివరి, మూడో వన్డేలో చాహల్ 6 వికెట్లు తీయడంతో ఆస్ట్రేలియా 48.4 ఓవర్లలో ఆలౌటైంది. వన్డే అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన భారత ఆరో బౌలర్‌గా చాహల్ ఘనత సాధించాడు. ఈ మ్యాచ్‌కు కోహ్లీ తుది జట్టులో మూడు మార్పులు చేశాడు. ఆల్ రౌండర్ విజయ్ శంకర్ ఈ మ్యాచ్‌తో వన్డేల్లో అరంగేట్రం చేయగా.. కుల్‌దీప్ స్థానంలో చాహల్, అంబటి రాయుడు స్థానంలో కేదార్ జాదవ్ జట్టులోకి వచ్చారు. అయితే యాదృచ్ఛికంగా అజిత్ అగార్కర్‌తో చాహల్ సమంగా నిలిచాడు. 2004లో ఆస్ట్రేలియాలో అగార్కర్ సాధించిన బౌలింగ్ ఫిగర్స్ 6/42ను చాహల్ కూడా సాధించాడు. టాస్ గెలిచిన కోహ్లీ ఆస్ట్రేలియాను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. 100 పరుగుల వద్ద 2 వికెట్లు కోల్పోయిన ఆస్ట్రేలియా 230 పరుగులకు ఆలౌటైంది.

చాహల్‌పై ప్రశంసలు

చాహల్ బౌలింగ్ ప్రదర్శనపై క్రికెట్ వర్గాల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి.

'చాహల్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. తను అవకాశమిచ్చినప్పుడే ఆడేలా ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను కట్టడి చేశాడు. నిజంగా అతను 6 వికెట్లకు అర్హుడు. ట్రంప్ కార్డ్‌ను సెలెక్ట్ చేశారు' **– సచిన్ టెండూల్కర్**

'వాహ్ జీ చాహల్! 6 వికెట్లతో హల్‌చల్ చేశాడు. శెభాష్' **– వీరేంద్ర సెహ్వాగ్**

'చాహల్ అద్భుతమైన బౌలింగ్ చేశాడు. మ్యాచ్‌ను టీమిండియా వైపుకు తిప్పాడు. టాప్ వికెట్లు తీశాడు. కెప్టెన్ అడిగినవన్నీ ఈ మ్యాచ్‌లో చేశాడు' **– హర్షా భోగ్లే**

'ఆస్ట్రేలియాను 230 పరుగులకు ఆలౌట్ చేయడంలో భారత బౌలర్లు అసాధారణ ప్రతిభ కనబరిచారు. యజ్వేంద్ర చాహల్ 6 వికెట్లు తీసి అద్భుత ప్రతిభ కనబరిచాడు' **– వీవీఎస్ లక్ష్మణ్**

'వన్డే క్రికెట్‌లో చాహల్ (6/42) ఉత్తమ బౌలింగ్ ప్రతిభ కనబరిచిన భారత ఆరో బౌలర్‌గా నిలిచాడు' **– మోహన్‌దాస్ మీనన్**

'వాట్‌ఎ సిక్స్-ఎస్‌ఫుల్ స్పెల్. చాహల్‌లో అసాధారణ ప్రతిభ ఉంది' **– హర్భజన్ సింగ్**



ఏ స్థానంలోనైనా ఆడగలను: ధోనీ

జట్టుకు అవసరమైనప్పుడు ఏ స్థానంలోనైనా ఆడేందుకు సిద్ధంగా ఉన్నాననిఇండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ స్పష్టం చేశాడు. 231 పరుగుల లక్ష్య ఛేదనలో ధోనీ 114 బంతుల్లో 87 పరుగులు చేశాడు. వరుసగా మూడో అర్ధశతకంతో ఆకట్టుకున్నాడు. 2014 తర్వాత అతడు ఒక సిరీస్‌లో వరుసగా మూడు అంతకన్నా ఎక్కువ అర్ధశతకాలు సాధించడం ఇదే తొలిసారి. ఆసీస్‌తో మూడు వన్డేల సిరీస్‌లో మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు అందుకున్న తర్వాత మీడియాతో మాట్లాడిన ధోనీ... 'జట్టుకు అవసరమైనప్పుడు ఏ స్థానంలోనైనా ఆడేందుకు సిద్ధం. నేను నాలుగో స్థానంలో ఆడినా, ఆరో స్థానంలో ఆడినా జట్టుకు సమతూకం తీసుకురావడం కీలకం. 14 ఏళ్ల అనుభవం తర్వాత ఆరో స్థానంలో ఆడనని చెప్పలేను. పిచ్ చాలా మందకొడిగా ఉంది. షాట్లు ఆడటం కష్టమైంది. అందుకే క్రీజులో పాతుకుపోవాలని అనుకున్నాం. జాదవ్ అద్భుతంగా ఆడాడు. వినూత్నమైన షాట్లు ప్రయత్నించాడు. ఆసీస్ బౌలర్లు కఠినంగా బంతులు విసిరారు. కేదార్ బ్యాటు, బంతితో జట్టుకు సహాయపడతాడు. కుల్‌దీప్ గతంలో ఆస్ట్రేలియా ఆడాడు. దీంతో ఊహించని విధంగా చాహల్‌ను తీసుకున్నాం. అనుకున్నట్టే అతడు రాణించాడు. ఆసీస్ పర్యటన చిరస్మరణీయంగా సాగింది. టీ20 సిరీస్‌ను డ్రా చేశాం. టెస్టు, వన్డే సిరీస్‌లు గెలిచాం' అని ధోనీ ముగించాడు.

'కోహ్లీలాంటి కెప్టెన్ అవసరం'

న్యూఢిల్లీ: విరాట్ కోహ్లీ లాంటి కెప్టెన్ టీమిండియాకు అవసరమని టీమిండియా మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ అన్నారు. ఓ వెబ్‌సైట్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో కృష్ణమాచారి శ్రీకాంత్ మాట్లాడుతూ కోహ్లీపై ప్రశంసల వర్షం కురిపించాడు. 'ఇప్పుడు భారత్ 300 పైచిలుకు లక్ష్యాన్ని ఛేదిస్తోందంటే జట్టు విరాట్ కోహ్లీపై ఆధారపడుతుందని అర్థం. గణాంకాల గురించి మాట్లాడితే విరాట్ కోహ్లీ ఛేదనలో 24 సెంచరీలు చేయగా అందులో 21 సార్లు భారత్ గెలిచింది. దూకుడు, బాధ్యతల అద్భుత మేలిమి కలయిక విరాట్ కోహ్లీ' అని ఆయన అన్నారు. 'దేశానికి తనను తాను నమ్మే, జట్టుపై విశ్వాసం ఉండే కెప్టెన్ అవసరం. ఇంతకుముందు కపిల్ అలా ఉన్నారని ఇప్పుడున్న క్రికెటర్లలో విరాట్ కోహ్లీ అలా ఉన్నాడు' అని శ్రీకాంత్ అన్నారు.

ప్రీ క్వార్టర్స్‌లో ఫెడరర్, నాదల్

- **షరపోవా, స్టీఫెన్స్, కెర్బర్ ముందంజ**
- **ఆస్ట్రేలియన్ ఓపెన్**





మెల్‌బోర్న్: డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెడరర్ (స్విట్జర్లాండ్), రఫెల్ నాదల్ (స్పెయిన్) ఆస్ట్రేలియా ఓపెన్‌లో వరుస విజయాలతో దూసుకెళ్తున్నారు. ఫెడరర్, నాదల్ శుక్రవారం జరిగిన మూడో రౌండ్‌లో విజయం సాధించి పీ క్వార్టర్స్‌కు చేరుకున్నారు. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన రోజర్ ఫెడరర్ తన కెరీర్‌లోని 100వ మ్యాచ్‌ను అద్భుతమైన విజయాన్ని నమోదు చేశాడు. ఎలాగైనా టైటిల్ కొట్టాలనే కసితో బరిలోకి దిగిన ఫెడరర్ శుక్రవారం జరిగిన మూడో రౌండ్‌లో అమెరికాకు చెందిన టేలర్ ఫ్రిట్జ్‌ను 6-2, 7-5, 6-2తో చిత్తుగా ఓడించాడు. దీంతో ఫెడరర్ తన 100వ మ్యాచ్‌లో అలవోకగా విజయం సాధించాడు. ఇక్కడ జరిగిన మరో పురుషుల సింగిల్స్ మూడో రౌండ్‌లో స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ 6-1, 6-2, 6-4తో అలెక్స్ మినార్ (ఆస్ట్రేలియా)పై విజయం సాధించి ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. మరో మ్యాచ్‌లో డిమిత్రోవ్ (బల్గేరియా) 7(7)- 6(5), 6-4, 6-4తో ఇటలీకు చెందిన ఫాబినోను ఓడించాడు. ఇక మహిళల సింగిల్స్‌లో జర్మనీకు చెందిన కెర్బర్ 6-1, 6-0తో ఆస్ట్రేలియాకు చెందిన కిమ్‌బెర్లీ బిరెల్‌పై గెలుపొందగా... మరో మ్యాచ్‌లో షరపోవా (రష్యా) 6-4, 4-6, 6-3తో డెన్మార్క్‌కు చెందిన కార్లోని వోజ్నియాకీని ఓడించింది. మరో మ్యాచ్‌లో అమెరికాకు చెందిన స్టీఫెన్స్ 7(8)- 6(6), 7(7)- 6(5)తో క్రోయేషియాకు చెందిన మార్టిక్‌పై విజయం సాధించి ప్రీ క్వార్టర్స్‌కు చేరుకుంది.

సెమీస్‌కు చేరిన సైనా



- **శ్రీకాంత్‌కు షాక్**
- **మలేసియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ**

కౌలాలంపూర్: మలేసియా ఓపెన్‌లో భారత టాప్ షట్లర్ సైనా నేహ్వాల్ వరుస విజయాలతో దూసుకెళ్తుంది. ఈ టోర్నీలో భాగంగా శుక్రవా రమి క్కడ జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్ పోరులో సైనా నెహ్వాల్ ప్రపంచ మాజీ చాంపియన్ నొజొమి ఒకుహర (జపాన్)ను ఓడించి సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. 48 నిమిషాలపాటు జరిగిన ఈ పోరులో సైనా తొలి రౌండ్ నుంచే పూర్తి ఆధిపత్యం కనబర్చింది. తొలి రౌండ్‌లో 21-18తో గెలిచిన సైనా, రెండో రౌండ్‌లో ఒకుహర నుంచి గట్టి పోటీ ఎదురైంది. రెండో రౌండ్‌లో సైనా చెమటోడ్చి 23-21తో ఒకుహరపై విజయం సాధించి సెమీస్ బెర్త్ ఖాయం చేసుకుంది. 28 ఏళ్ల సైనా 2017లో టైటిల్ విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే.

'ఒకుహరతో మరో అద్భుతమైన మ్యాచ్ ఆడాను. గెలిచినందుకు చాలా సంతోషంగా ఉంది' అని మ్యాచ్ అనంతరం సైనా పేర్కొంది. ఇక్కడ జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో కిదాంబి శ్రీకాంత్‌కు షాక్ తగిలింది. కొరియాకు చెందిన సన్ వాన్ హో చేతిలో 21-23, 21-16, 21-17తో శ్రీకాంత్ ఓడిపోయి ఇంటి ముఖం పట్టాడు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District. Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.